

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం 24-03-2023 | సంపుటి : 04 | సంచిక : 180 | పేజీలు : 4 | వెల : రూ 3-00

# పూర్తయిన ఎమ్మెల్సీ ఎన్నికలు..






విజయవాడ, మార్చి 23, ఎన్నికల సంఘం చెప్పిన సమయానికి కంటే ముందే ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సాయంత్రం మూడు గంటల వరకు ఓటు వేసే ఛాన్స్ ఉన్నప్పటికీ ఎమ్మెల్యేలంతా ముందుగానే వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి హడావుడి లేకుండా ప్రశాంతంగా సాగింపోయింది ప్రక్రియ. 175 మంది ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వివిధ కారణాలతో వివిధ రోజులుగా సభకు దూరంగా ఉంటున్న వాళ్లు కూడా అసెంబ్లీకి వచ్చి తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేశారు. అలాంటి వారిలో ఒకరు గంటా శ్రీనివాసరావు అయితే రెండో వ్యక్తి నారా చంద్రబాబు నాయుడు. పార్టీల మైండ్‌గేమ్‌తో చాలా టెన్షన్ పెట్టిన ఎన్నికల ఫలితం నాలుగు గంటల తర్వాత తెలియనుంది. అప్పటి వరకు ఎవరు ఎటు వేశారు.. ఫలితం ఎలా ఉంటుందనే ఉత్కంఠ కొనసాగుతుంది. కొందరు అసంతృప్త ఎమ్మెల్యేలు ఉన్నారంటూ అధికార పార్టీలో వినిపిస్తున్న బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌కు ఈ ఎన్నికతో తెరదించాలని జగన్ భావిస్తున్నారు. ఎంతో చర్చకు దారి తీసిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ పూర్తైంది. సీఎం జగన్ మోహన్ రెడ్డి మొదటి ఓటు వేయడంతో ప్రక్రియ ప్రారంభమైంది. ఓ వైపు అసెంబ్లీ నడుస్తుండగానే ఎమ్మెల్యేలంతా ఒక్కొక్కరుగా వచ్చి ఓటు వేసి వెళ్లారు. టీడీపీ సభ్యులంతా చంద్రబాబుతో కలిసి వచ్చి ఓటు వేశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం నుంచి అంతా కలిసి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏడు స్థానాలకు జరిగే ఈ ఎన్నికల్లో వైసీపీ తరఫున ఏడుగురు బరిలో నిలబడితే... ఒక స్థానం కోసం టీడీపీ కూడా పోటీ పడింది. ఆ పార్టీ తరఫున పంచుమర్తి అనూరాధ పోటీలో నిలిచారు. వైసీపీ తరఫున బరిలో జయమంగళ వెంకటరమణ, మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, బొమ్మి ఇజ్రాయిల్, కోలా గురువులు, పోతుల సునీత, పెనుమత్స సూర్యనారాయరాజు ఉన్నారు. తనను నిండు శాసనసభలో అవమానించారని కన్నీళ్లు పెట్టుకన్న చంద్రబాబు... ఇకపై గెలిచే సభలో అడుగుపెడతానంటూ 2021 నవంబర్ 19న శపథం చేశారు. అన్నట్టుగానే అప్పటి నుంచి సభకు వెళ్లడం లేదు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు సభలో అడుగు పెట్టారు. వైసీపీ ఎమ్మెల్యే అప్పల నాయుడు కుమారుడి పెళ్లి ఉంది. ఆ పనుల్లో బిజిగా ఉన్న ఆయన కూడా వచ్చి ఓటు వేసి వెళ్లారు. ఆయన వైసీపీ స్పెషల్ అరేంజ్‌మెంట్స్ చేసింది. తన కుమారుడి పెళ్లిన అయిన తర్వాత స్పెషల్ ఫ్లైట్‌లో తీసుకొచ్చి ఓటు వేయించింది. ఉదయం నుంచి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలపై రకరకాల ప్రచారాలు నడుస్తున్నాయి. గంటా రాజీనామా ఆమోదించారని వార్తలు హల్‌చల్ చేశాయి. చాలా కాలంగా శాసనభకు రాని ఆయన ఇవాళ వచ్చి ఓటు వేసి వెళ్లారు. తమ పార్టీ అభ్యర్థి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఒక్క ఓటే కానీ చాలా ఎఫెక్టివ్‌ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు క్రాస్ ఓట్ చేసి ఉన్నా... చెల్లని ఓటు వేసినా ఉన్నా టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనూరాధ గెలుస్తారు. అధికార పార్టీలో కొంత మంది ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారన్న ప్రచారం కొంత కాలంగా సాగుతోంది. ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బయట పడ్డారు. ఇంకా కొంతమంది ఉన్నారని టాక్ నడుస్తోంది ఇలాంటి సమయంలో తేడా జరిగితే మాత్రం అధికార పార్టీకి పెద్ద దెబ్బగానే విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే అలాంటి ప్రమాదం రాకుండా అధికార వైసీపీ చాలా జాగ్రత్తలు తీసుకుంది. నాలుగైదు మాక్ పోలింగ్‌లు నిర్వహించిది. తప్పు జరిగే అవకాశం లేకుండా అందరి ఎమ్మెల్యేలతో నేతలు మాట్లాడినట్టు సమాచారం.

## టీడీపీ పనికిమాలిన మాటలకు సమాధానం చెప్పాల్సిన పని లేదు: బొత్స

అమరావతి: ఏపీలో ఏడు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ స్థానాలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే, కౌంటింగ్ నేపథ్యంలో టీడీపీ నేతలు ఓవరాక్షన్‌కు దిగారు. ఎన్నికల్లో గెలుపునకు అవసరమైన మెజార్టీ లేకపోయినా గెలుపుపై సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. కాగా, టీడీపీ నేతల ఓవరాక్షన్‌పై మంత్రి బొత్స సత్యనారాయణ కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా బొత్స మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ నేతలు మాట్లాడే ప్రతి పనికిమాలిన మాటలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. ఏడుకి ఏడు ఎమ్మెల్సీలను మేమే గెలుస్తాం. గంటా మాటలు గొప్పలు చెప్పుకోవడానికే. రాజీనామా ఆమోదిస్తే స్పీకర్ చెబుతారు కదా. గంటా అతని పబ్లిసిటీ కోసం చెప్పుకుంటే మేమెందుకు సమాధానం చెప్పాలి. టీడీపీ నేతలకు నిలకడ లేదు.



## భార్యపై హత్యాయత్నం..భర్తకు పదేళ్ల జైలు శిక్ష


కాకినాడ భార్య పై హత్యాయత్నం చేసిన కేసులో భర్తకు పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్ట్ గురువారం 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 5,000- జరిమానా విధించింది. 2018 వ సంవత్సం మేనెలలో ఈ ఘటన జరిగింది. పిఠాపురం లో ఐశ్వర్య గార్డెన్స్ లో బాధితురాలు ముమ్మిడి సుబ్బలక్ష్మి (30) భర్త సుబ్రహ్మణ్యం తో నివాసం వుంటుంది. భర్త బిలాస్ పూర్ రైల్వే లో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నాడు. ఇద్దరు కలిసి కొండవరం వెళ్లి, తిరిగి వారి ఇంటికి ఐశ్వర్య గార్డెన్ కి వచ్చి నిద్రపోయారు. అర్ధరాత్రి సమయంలో నిందితుడు భార్య ప్రవర్తన పై అనుమానం పెంచుకొని, ఆమె పేరున ఉన్న ఆస్తిని 10 ఎకరాలు తన పేరున మార్చడం లేదని ద్వేషం పెంచుకుని చంపాలనే ఉద్దేశంతో, ఫిర్యాదిపై మత్తుమందు చల్లి, కత్తితో విచక్షణారహితంగా నరికి పారిపోయాడు. దాడిలో భార్య రెండు చేతులు మణికట్టుల వద్ద తెగిపోయాయి.

## ఏపీ హైకోర్టు తరలింపు న్యాయస్థానాల పరిధిలోనే: కేంద్ర ప్రభుత్వం




ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం హైకోర్టు అమరావతిలో ఏర్పాటైందని కేంద్ర న్యాయ శాఖ స్పష్టం చేసింది. కర్నూలుకు తరలిచాలంటే హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం కలిసే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. ఈ మేరకు రాజ్యసభలో తెదేపా ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపు ప్రస్తుతం న్యాయస్థానాల పరిధిలోనే ఉందని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని 214 నిబంధన, 2018లో కేంద్రం వర్సెస్ దన్ గోపాల్ రావు, ఇతరుల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, ఆంధ్రప్రదేశ్ పునర్విజన చట్టం 2014 ప్రకారం అమరావతిలో హైకోర్టు ఏర్పాటైందని వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు ఉమ్మడి హైకోర్టుగా ఉన్న అప్పటి హైదరాబాద్ హైకోర్టు, ఆనాటి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాతే పునర్విభజన చట్టం ప్రకారం ఏపీ హైకోర్టు అమరావతిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు తరలించేందుకు ప్రతిపాదించారని గుర్తు చేశారు. సీఎం మూడు రాజధానుల ప్రతిపాదనకు వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయని పేర్కొన్నారు. హైకోర్టు తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు అభిప్రాయాలు వెల్లడించాల్సి ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి తెలిపారు.

## 'పోలవరం' ఎత్తు ప్రస్తుతానికి 41.15 మీటర్లకే పరిమితం: కేంద్రం



ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం కీలక విషయాన్ని వెల్లడించింది. ప్రస్తుతానికి పోలవరం ఎత్తు 41.15 మీటర్లకే పరిమితమని తేల్చి చెప్పింది. పార్లమెంటులో వైకాపా ఎంపీ సత్యవతి అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయమంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తొలిదశలో 41.15 మీటర్ల మేరకే పోలవరంలో నీటిని నిల్వ చేయనున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. తొలిదశ సహాయ, పునరావాసం అంతవరకేనని స్పష్టం చేశారు. తొలిదశ సహాయ, పునరావాసం మార్చి 2023 నాటికే పూర్తి కావాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే, తొలిదశలో 20,946 నిర్వాసిత కుటుంబాలకే సహాయ, పునరావాసం ఖరారైందని వెల్లడించారు. ఇప్పటివరకు కేవలం 11,677 నిర్వాసిత కుటుంబాలకే సహాయ, పునరావాసం కల్పించినట్లు తెలిపారు. సహాయ, పునరావాసం మార్చి నాటికే పూర్తి కావాల్సి ఉన్నా... అందులో కూడా జాప్యం జరిగిందని కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా వివరించారు.

# ఉత్సాహంగా శోభకృత్ ఉగాది ఉత్సవాలు


### సంప్రదాయ పంచెకట్టులో హాజరైన జగన్



అమరావతి,మార్చి23: శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు ఘనంగా జరుపుకుం టున్నారు. ఉగాది పచ్చడి సేవించి తెలుగు వారి నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో పండితులు పంచాంగ శ్రవణాలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా నేతలు ప్రజలు ఈ పండుగను వైభవంగా నిర్వహించారు. ఏపీ సీఎం జగన్ ఉగాది వేడుకలు అత్యంత వైభవంగా తెలుగు సంప్రదాయాలు సంస్కృతి ఉట్టిపడేలా సాగాయి. తాడేపల్లిలోని ఏపీ సీఎం జగన్ నివాసంలోని గోశాలలో ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆయన సతీమణి భారతిలు సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకలకు ముందు శ్రీ వేంకటేశ్వర ఆలయంలో సీఎం జగన్ దంపతులు పూజలు నిర్వహించి ఉగాది పచ్చడిని స్వీకరించారు. సంప్రదాయ దుస్తుల్లో జగన్ భారతి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ సీఎం జగన్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీశోభకృత్ నామ సంవత్సరం అందరి జీవితాల్లో శుభాలు కలిగించాలని జగన్ ఆకాంక్షించారు. రైతులకు, అక్కచెల్లెమ్మలు సకల వృత్తుల వారికి ఈ శోభకృత్ నామ సంవత్సరంలో మంచి జరగాలని... తద్వారా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నానని జగన్ తెలిపారు. ఉగాది సందర్భంగా సోమయాజి పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా జగన్ సోమయాజిని సన్మానించారు. తిరుమల ఆలయం విజయవాడ కనకదుర్గ ఆలయం నుంచి వచ్చిన పండితులు సీఎం జగన్ మోహన్ రెడ్డి దంపతులను ఆశీర్వదించారు.

## ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి కన్నుమూత

అమరావతి సీనియర్ జర్నలిస్ట్, ఎపి ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి ఉగాది పర్వదినాన మృతి చెందారనే వార్త జర్నలిస్ట్ లను ఆవేదనకు గురి చేసింది. ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి ఇకలేరు అనే విషయం ఆయన గురించి తెలిసిన వారిని, పరిచయం ఉన్న వారిని అయ్యో అనేలా బుధవారం 'రాత్రి' సమయం శ్రీనాథ్ రెడ్డిని అనంతలోకాలకు తీసుకెళ్లింది. వైసీపీ ప్రభుత్వం 2019లో దేవిరెడ్డిని ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమించింది. 2021 నవంబరు 7తో ఆయన రెండేళ్ల పదవీ కాలం ముగిసింది. అప్పటి నుంచి మరో ఏడాదిపాటు పదవీ కాలాన్ని పొడిగిస్తూ జగన్ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. దానితో మొన్న మొన్నటి వరకు ఆయన ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ గా విధులు నిర్వహించారు. దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి జన్మ స్థలం వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కొవరంగుట్టపల్లి ప్రాంతం. ఆంధ్రప్రభ పత్రిక ద్వారా 1978లో



ఆయన జర్న లిజం వృత్తిలోకి చేరారు. ఆయన సుమారు 40 ఏళ్ళ పాటు జర్నలిజం రంగంలో కొనసాగారు. కడప జిల్లాలో జర్నలిస్ట్ గా పనిచేసినప్పు డు దేవిరెడ్డి రాయలసీమ వెనుకబాటుకు సంబంధించి రాజకీయ,ఆర్థిక, సామాజిక అంశాలపై 'సెవెన్ రోడ్స్ జంక్షన్' పేరుతో ఆయన రాసిన కాలమ్స్ పాఠకుల ప్రాచుర్యం పొందాయి. 1990వ దశకంలో ఆయన కొన్నేళ్లపాటు బీబీసీ రేడియోకు పనిచేయడం జరిగింది. ఇండియన్ ఎక్స్ ప్రెస్, సాక్షి పత్రికల్లో కూడా జర్నలిస్ట్ గా పనిచేశారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కడప జిల్లా అధ్యక్షుడిగా సుమారు 24 సంవత్సరాలు పనిచేశారు.

## రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష

ఢిల్లీ: ఓ పరువునష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ని సూరత్ కోర్టు దోషిగా తేల్చింది. ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఆ వెంటనే ఆయనకు బెయిల్ కూడా మంజూరు చేసింది. అలాగే ఈ తీర్పును పై కోర్టులో అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. ఈ మేరకు శిక్షను 30 రోజుల పాటు నిలుపుదల చేసింది. తీర్పు వెలువరించిన సమయంలో రాహుల్ న్యాయస్థానంలోనే ఉన్నారు. 'మోదీ ఇంటి పేరు ఉన్నవారందరూ దొంగలు' అంటూ 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కర్ణాటకలోని కోలార్‌లో రాహుల్ వ్యాఖ్యానించారని గుజరాత్ భాజపా ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ సూరత్ న్యాయస్థానంలో పరువునష్టం దావా వేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు రాహుల్ వాంగ్మూలాన్ని నమోదు చేసింది. అలా అనలేదని న్యాయస్థానానికి రాహుల్ తన వాదనను వినిపించారు. కానీ, కోర్టు మాత్రం ఐపీసీ సెక్షన్ 499, 500 ప్రకారం ఆయనను దోషిగా తేల్చింది. వెంటనే రాహుల్ అభ్యర్థన మేరకు బెయిల్ కూడా మంజూరు చేసింది. కోర్టు తీర్పు అనంతరం రాహుల్ గాంధీ స్పందించారు. మహాత్మా గాంధీ చేసిన ఓ వ్యాఖ్యను కోర్టు తీర్పు తర్వాత ట్వీట్ చేశారు. "సత్యం, అహింసపైనే నా ధర్మం ఆధారపడి ఉంది. సత్యం నా భగవంతుడు. ఆయన్ని చేరుకోవడానికి కావాల్సిన సాధనమే అహింస" అని పేర్కొన్నారు. ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా స్పందిస్తూ.. "నా సోదరుడు (రాహుల్ గాంధీ) ఎప్పుడూ భయపడలేదు. భవిష్యత్‌లో భయపడడు కూడా.." అని అన్నారు.



# సంపాదకీయం

శుక్రవారం 24-03-2023

## కార్పొరేట్ బ్యాంకుల కష్టాలు....

పారిశ్రామిక రంగం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోంది. కేంద్ర బడ్జెట్ రూపంలో ఏటా లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తోంది. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు బ్యాంకు రుణాల రూపంలో ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. తద్వారా, వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడానికి ఆయా కంపెనీలు, వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం ఉ బ్యాంకులు సాయపడుతున్నాయి. అయితే, వ్యాపార వృద్ధి కోసం బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్న కొందరు, ఆ రుణాలను తిరిగి చెల్లించడంలో కాలయాపన చేస్తుంటారు. ఉద్దేశపూర్వకంగానే రుణాలను ఎగ్గొడుతుంటారు. అలాంటి వారిని విల్‌ఫుల్ డిఫాల్టర్స్ లేదా ఉద్దేశపూర్వక ఎగవేతదార్లుగా పిలిస్తారు.ఒక జాతీయ మీడియా సంస్థ లెక్క ప్రకారం... ఈ ఏడాది, ఉద్దేశపూర్వక ఎగవేతదార్లు దేశంలోని కొన్ని పెద్ద బ్యాంకులను రూ. 88,435 కోట్ల మేర మోసగించినట్లు తెలిసింది. గత ఏడాది ఈ మొత్తం రూ. 75,294 కోట్లుగా ఉంది. ఎగవేత మొత్తమే కాదు, ఈ ఏడాది ఉద్దేశపూర్వక ఎగవేతదార్ల సంఖ్య కూడా పెరిగింది.నేషనల్ మీడియా రిపోర్ట్ ప్రకారం... ఉద్దేశపూర్వక ఎగవేతదార్లు దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన కొన్ని బ్యాంకులను మోసం చేశారు. బాధిత బ్యాంకుల లిస్ట్‌లో.... పంజాబ్ నేషనల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడీబీఐ బ్యాంక్ సహా మరికొన్ని బ్యాంకులు ఉన్నాయి.రుణ మొత్తం లేదా నెలవారీ వాయిదాలు చెల్లించగలిగే స్థితిలో ఉనప్పటికీ చెల్లించని వ్యక్తులే విల్‌ఫుల్ డిఫాల్టర్లు. ఏరు దాటే వరకు పడవ మల్లన్న, ఏరు దాటాక బోడి మల్లన్న అనే టైపు వీళ్లు. అప్పు తీసుకునే సమయంలో ఉన్న శ్రద్ధ, తిరిగి తీర్చడంలో ఉండదు. డేటా ప్రకారం, 2022 డిసెంబర్ వరకు, ఈ ఉద్దేశపూర్వక ఎగవేతదార్లకు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు ఉన్న బకాయిలు రూ. 38,712 కోట్లు. బ్యాంక్ ఆఫ్ బరోడాకు 2023 జనవరి వరకు రావల్సిన మొత్తం రూ. 38,009 కోట్లు. గత ఏడాది ఈ మొత్తం రూ. 24,404 కోట్లు కాగా, ఈ ఏడాది రూ. 38,000 కోట్లు దాటింది. దేశంలో అతి పెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రావలసిన బకాయిలు రూ. 11,714 కోట్లు. గత ఏడాది మార్చి వరకు ఈ సంఖ్య రూ. 9,007 కోట్లు. ఐడిబిఐ బ్యాంక్ వద్ద 2023 ఫిబ్రవరి వరకు ఉన్న రుణ బకాయిల మొత్తం రూ. 26,400 కోట్లు.ఉద్దేశపూర్వక ఎగవేతదార్ల గురించిన సమాచారాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాద్ పార్లమెంటులో వెల్లడించారు. గీతాంజలి జెమ్స్ లిమిటెడ్ దేశంలోనే అతి పెద్ద విల్‌ఫుల్ డిఫాల్టర్ కంపెనీ అని తెలిపారు. ఈ కంపెనీ రూ. 7,848 కోట్ల రుణాన్ని కట్టకుండా ఎగ్గొట్టింది. ఎరా ఇన్‌ఫ్రా ఈ జాబితాలో రెండో స్థానంలో ఉంది. ఈ కంపెనీ బ్యాంకులకు రూ. 5,879 కోట్ల బకాయి పడింది. లిస్ట్‌లో మూడో పేరు రేయ్ ఆగ్రో. ఈ కంపెనీ చెల్లించాల్సిన మొత్తం బకాయిలు రూ. 4,803 కోట్లు. మరో వైపు ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ కష్టాలు అన్నీ ఇన్నీ కావు! ఏడాది కాలంగా ఆయన ప్రతి వారం రూ.3000 కోట్ల మేర నష్టపోతున్నారట! అత్యున్నత శిఖర స్థాయి నుంచి ఇప్పుడాయన సంపద 53 బిలియన్ డాలర్లకు తగ్గిపోయిందని ఎంత్రీఎం హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2023 పేర్కొంది. కొన్ని రోజుల క్రితం ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానంలో ఉన్న ఆయన ఇప్పుడు 23కు తగ్గిపోయారని వెల్లడించింది. హిండెన్‌బర్గ్ రిపోర్టుతో అదానీ కంపెనీల షేర్లు కుప్పకూలిన సంగతి తెలిసిందే.కొన్ని నెలల్లోనే అదానీ 28 బిలియన్ డాలర్ల నికర సంపదను నష్టపోయారు. దాంతో భారత్ అత్యంత సంపన్నుడి స్థానానికి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీకి వదిలేయాల్సి వచ్చింది. ప్రస్తుతం అంబానీ నెట్‌వర్త్ 82 బిలియన్ డాలర్లుగా అంచనా. 'తమ సంపదలో 35 శాతం నష్టపోవడంతో గౌతమ్ అదానీ కుటుంబం ఆసియా రెండో సంపన్నుడి స్థానాన్ని ఝూంగ్ షాన్‌షన్‌కు వదిలేయాల్సి వచ్చింది. హిండెన్ బర్గ్ నివేదిక వచ్చినప్పట్నుంచి అదానీ 60 శాతం సంపద కోల్పోయారు' అని హురున్ ఇండియా వెల్లడించింది.చివరి ఏడాది కాలంలో అదానీ 35 శాతం సంపద కోల్పోయారు. ప్రపంచ కుబేరుల్లో తొమ్మిదో స్థానంలో నిలిచిన అంబానీ 20 శాతం సంపద నస్టపోయారు. అవెన్యూ సూపర్ మార్కెట్ (డీమార్ట్) ఛైర్మన్, స్టాక్‌మార్కెట్ ఇన్వెస్టర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబం 30 శాతం సంపద నష్టపోయారు. ప్రస్తుతం వారి సంపద 16 బిలియన్ డాలర్లుగా అంచనా. గ్లోబల్ టాప్-100 నుంచీ ఆయన తప్పుకోవాల్సి వచ్చింది.కొటక్ మహీంద్రా బ్యాంకు సీఈవో ఉదయ్ కొటక్13 శాతం నష్టపోయారు. ఆయన సంపద 14 బిలియన్ డాలర్లు. ప్రపంచ సంపన్నుల్లో ఆయన ర్యాంకు 135. వ్యాక్సింగ్ కింగ్ సైరస్ పూనావాలాఆస్తి 4 శాతం పెరిగి 27 బిలియన్ డాలర్లకు చేరుకుంది. హురున్ గ్లోబల్ రిచ్ లిస్టులో భారత్ 187 బిలియనీర్లతో మూడో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా మన కన్నా ముందున్నాయి.'ఐదేళ్లుగా అంతర్జాతీయ సంపన్నుల జనాభాలో భారతీయుల సంఖ్య పెరుగుతోంది. ఐదేళ్ల క్రితం గ్లోబల్ బిలియనీర్ల జాబితాలో 4.9 శాతం మంది ఉండగా ఇప్పుడు 8 శాతానికి పెరిగారు' అని హురున్ తెలిపింది. ఇక హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2023లో మొత్తం బిలియనీర్ల సంఖ్య 8 శాతం తగ్గింది. గతేడాది వారి మొత్తం సంపద 10 శాతం తగ్గింది. 1078 మంది సంపద పెరగ్గా అందులో 176 మంది కొత్తవాళ్లే. 2479 మంది నెట్‌వర్త్‌లో ఎలాంటి మార్పు లేదు. 445 మంది సంపద మాత్రం తగ్గింది.

## నెల్లూరులో మాస్క్ మస్ట్...



నెల్లూరు, మార్చి 23, నెల్లూరు జిల్లాలో మాస్క్ నిబంధన మళ్లీ తెరపైకి తెచ్చారు అధికారులు. ఇటీవల జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సహా స్పందనకు వచ్చినవారందరూ మాస్క్ లు ధరించి కనిపించారు. మాస్క్ లేనిదే కలెక్టరేట్ లోకి ఎంట్రీ లేదన్నారు అధికారులు. కచ్చితంగా మాస్క్ ధరించి రావాలని చెప్పారు. జిల్లాలో వైరల్ ఫీవర్లు పెరగడం, ఫ్లూ లక్షణాలతో కొంతమంది ఆస్పత్రుల్లో చేరడంతో కలెక్టర్ చక్రధర్ బాబు కఠిన నిబంధనలు తీసుకొచ్చారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కలెక్టరేట్ సహా ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగిన స్పందన కార్యక్రమాల్లో అధికారులంతా మాస్క్ లతో కనిపించారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా మాస్క్ లు ధరించి వచ్చారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శానిటైజర్ల వినియోగం కూడా పెరిగింది.కరోనా భయం తగ్గినట్టే తగ్గి మళ్లీ మొదలైంది. తెలుగు రాష్ట్రాల్లో ఫ్లూ జ్వరాల బాధితులు ఎక్కువయ్యారు. ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య కూడా పెరిగింది. ఊ3ఔ2 వైరస్ కూడా అక్కడక్కడా బయటపడుతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం కూడా అప్రమత్తత ప్రకటించింది. ఇటు రాష్ట్రంలో కూడా ఫీవర్ సర్వే మొదలు పెట్టారు అధికారులు. ఇంటింటికీ వెళ్లి జ్వరపీడితుల వివరాలు సేకరిస్తున్నారు.దేశవ్యాప్తంగా కరోనా యాక్టివ్ కేసుల్లో పెద్దగా పెరుగుదల లేకపోయినా కొత్తగా వైరస్ బారిన పడుతున్నవారి సంఖ్య మాత్రం పెరుగుతోంది. దీంతో కేంద్రం కూడా మార్గదర్శకాలు విడుదల చేసింది. వైరల్ ఫీవర్లను తేలిగ్గా తీసుకోవద్దని ఆస్పత్రుల్లో చేరి చికిత్స తీసుకోవాలని సూచిస్తోంది. వైరల్ ఫీవర్లకు వాడాల్సిన మందుల వివరాలపై కూడా కేంద్రం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది.ప్రస్తుతానికి కరోనా కేసుల్లో భారీ పెరుగుదల లేకపోవడంతో ఆంక్షలు విధించే అవకాశాలు చాలా తక్కువ అంటున్నారు. అయితే ఎక్కడికక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం అలర్ట్ గా ఉంటున్నాయి. తమిళనాడులో కూడా మాస్క్ నిబంధన తెరపైకి తెచ్చారు. ఇటు ఏపీలో అన్ని జిల్లాల్లో మాస్క్ నిబంధన లేకపోయినా నెల్లూరు మాత్రం అలర్ట్ అయింది. తమిళనాడుకు దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో నెల్లూరు జిల్లాలో అధికారులు అప్రమత్తం అయ్యారు. జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు సూచనలతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలలో అవగాహన కల్పిస్తున్నారు. అవగాహనలో భాగంగా జిల్లాలో మాస్క్ నిబంధన తెరపైకి తెచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించాల్సిందేనంటున్నారు. అయితే ఎక్కడా జరిమానాల ప్రస్తావన తేవడంలేదు. ప్రజలు కూడా స్వచ్ఛందంగానే మాస్క్ లు ధరించి బయటకు వస్తున్నారు. షాపింగ్ మాల్స్ లో కూడా మాస్క్ నిబంధన అమలు చేస్తున్నారు. జిల్లాలో ఫ్లూ లక్షణాలు లేవని, అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు డాక్టర్ ఎం.పెంచలయ్య. ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేశామని చెప్పారు. ప్రస్తుత సీజన్ లో జలుబు, దగ్గు వారం, పదిరోజుల ఉంటుందని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే నయం అవుతుందన్నారు డిఎంహెచ్వో . వేసవిలో మజ్జిగ, నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అధికంగా తీసుకుంటూ ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండబారిన పడకుండా ఉండాలన్నారు.

## బీజేపీ, జనసేన మధ్య ఎమ్మెల్సీ దూరం

విజయవాడ, మార్చి 23, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీ బీజేపీకి జనసేన మద్దతు ఇవ్వకపోవడంపై ఆ పార్టీ ఆగ్రహంది. తాము అడిగినా పవన్ కల్యాణ్ స్పందించలేదని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన మాధవ్ అసంతప్తి వ్యక్తం చేశారు. బీజేపీ పదాధికారుల సమావేశం తర్వాత మాధవ్ మీడి?యాతో మాట్లాడారు. గతంలో కూడా తమ పార్టీ ఓటమి చెందినా.. ఆ తర్వాత పుంజుకున్న సంఘటనలు ఉన్నాయని.. ఎమ్మెల్సీ ఎన్నికలలో గతంలో కంటే బీజేపీకి మెరుగైన ఓట్లు వచ్చాయని మాధవ్ చెప్పుకొచ్చారు. ఉత్తరాంధ్ర లో మాత్రమే బీజేపీ వైఫల్యం చెందిందన్నారు. భవిష్యత్ లో ఎటువంటి అంశాలపై దృష్టి పెట్టాలనేది మా పెద్దలు సూచనలు చేశారని.. ఏప్రిల్ 14 వరకు వివిధ రూపాలలో కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రకటించారు. బీజేపీ పొత్తులకు సంబంధించి కూడా అనేక అంశాలు ప్రచారం జరుగుతున్నాయని.. ఎ బీజేపీ బలోపేతం కోసం తాము కృషి చేస్తామని మాధవ్ చెప్పారు. పొత్తులపై మాత్రం మా జాతీయ నాయకత్వం నిర్ణయిస్తుందన్నారు. పవన్ కళ్యాణ్ చెప్పినట్లు ఇరు పార్టీల కార్యకర్తలు పని చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ దిశగా ఆలోచన చేయాలని పవన్ కళ్యాణ్, మనోహర్ గారిని కోరుతున్నామని మాధవ్ తెలిపారు. ఏపీలో పవన్ కళ్యాణ్ కు మంచి అవకాశం ఉంది.. మొన్న సభకు వచ్చిన జనాన్ని అందరూ చూశారు.. ఇరు పార్టీలు కలిసి పోరాటాలు చేస్తే.. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. బీజేపీతో కలిసి ముందుకు వెళితే.. రాష్ట్రంలో ఒక ప్రభంజనం సృష్టించవచ్చన్నారు. ప్రస్తుతానికి బీజేపీ, జనసేన పొత్తుతో ముందుకు వెళుతున్నాయన్నారు. అమరావతి రాజధానిగా ఉంటుందని ఇప్పటికే చెప్పాం.. బీజేపీ దానికే కట్టుబడి ఉందని మాధవ్ చెప్పారు. ఏ పార్టీ తీర్మానం చేయకపోయినా.. బీజేపీ మాత్రమే ఏపీ రాజధాని అమరావతి అని తీర్మానం చేసిందన్నారు. బీజేపీ చేపట్టిన అనేక కార్యక్రమాలకు జనసేనను ఆహ్వానించామని వారు రాలేదన్నారు. ఎవరిలోనైనా అసంతృప్తి ఉంటే... అంతర్గతంగా వాటిని వేము పరిష్కరించుకుంటామన్నారు. బీజేపీ ఎప్పుడూ వైసీపీ ప్రభుత్వ అవినీతిపై పోరాటం చేస్తూనే ఉందని మాధవ్ చెప్పారు. ఇసుక, మైనింగ్, మద్యం వంటి అంశాలలో పోరాటాలు కూడా చేశాం గతంలో ప్రజా పోరు పేరుతో వీధి సభలు పెట్టాం ... రెండో విడత కూడా వీధి సమావేశాలు పెట్టి.. జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. యువతను, ఉద్యోగులను, మహిళలను జగన్ మోసం చేశారని.. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉండి.. జీతాలు కూడా సకాలంలో వేయని పరిస్థితికి తెచ్చారని ఆరోపించారు. మే 1వ తేదీ తర్వాత ఛార్జిషీటు కార్యక్రమం చేపడతామని.. ఎన్నికల సమయంలో వైసీపీ నేతలు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తామన్నారు. వాటిని అమలు చేయకుండా ఏ విధంగా మోసం చేసిందీ వివరిస్తామని ప్రకటించారు. ఈ ఛార్జిషీటు మొత్తం రెడీ అయ్యాక బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. విశాఖలో జరిగిన సమ్మిట్ లో కేంద్ర మంత్రులు వచ్చి.. హామీలు ఇచ్చారు .. అది రాజకీయ సభ కాదు కాబట్టే... రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యామన్నారు. ఎవరు పెట్టుబడి పెట్టినా... అది ఏపీకి వస్తుంది కాబట్టి.. వేము స్వాగతిస్తున్నామన్నారు.

## దిద్దుబాటుపై ఆలోచనలు

విజయవాడ, మార్చి 23, (న్యూస్ పల్స్) మూడు పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓడిపోవడం వైఎస్ఆర్‌సీపీకి నష్టం కాదు.. హెచ్చరికా కాదు అని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా ముందు ప్రకటించారు. పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం తగ్గిపోకుండా బహిరంగంగా ఆయన అలా కాకుండా మరోలా స్పందించే అవకాశం లేదు. కానీ అంతర్గతంగా దిద్దుబాటు చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా లేదా అన్నది ఇప్పుడు ఆ పార్టీలోనే చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో ఆ పార్టీ కార్యకర్తలు స్పందిస్తున్న తీరు.. వైసీపీ హైకమాండ్ వ్యూహాలపై మాత్రం భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. ఎన్నిక ఏదైనా వైఎస్ఆర్‌సీపీలో ఒకే వ్యవస్థ అన్ని బాధ్యతలు చూసుకుంటుంది. ఆ వ్యవస్థకు నేరుగా పార్టీతో సంబంధం ఉండదు. ఆ వ్యవస్థ పేరు ఐ ప్యాక్. ప్రశాంత్ కిషోర్ కు చెందిన ఈ సంస్థను వైసీపీ తరపున పూర్తి స్థాయి పొలిటికల్ మేనేజ్మెంట్ చేస్తుంది. ఫట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాల తర్వాత కొంత మంది పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలోనే అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు వైఎస్ఆర్‌సీపీకి పట్టిన దరిద్రం ఐ ప్యాకేనని...క్షేత్ర స్థాయి పరిస్థితుల్ని అర్థం చేసుకోవడం లేదని మండిపడ్డారు. ఇక అంతర్గతంగా కూడా ఈ అంశంపై విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఐ ప్యాక్ చేతిలో మొత్తం పెట్టడం కరెక్ట్ కాదన్న అభిప్రాయం ఎక్కువ మంది వినిపిస్తున్నారు. అయితే పార్టీ అధినేత సీఎం జగన్ కు ఐ ప్యాక్ మీద ఎక్కడా లేనంత నమ్మకం ఉంది. ఆ నమ్మకాన్ని కొనాసిగిస్తే.. ఐ ప్యాకే వచ్చే ఎన్నికల్లో లీడ్ చేస్తుంది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలో అయినా జగన్ మనసు మార్చుకుని ఐ ప్యాక్ ను పక్కన పెడితే బాగుండని ఎక్కువ మంది కోరుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ఆర్‌సీపీ నేతలు , కార్యకర్తల్లో ఓ రకమైన నిస్తేజం కనిపిస్తోంది. దీనికి కారణం వాలంటీర్, సచివాలయ వ్యవస్థతో అసలు పార్టీ కార్యకర్తలకు విలువ లేకుండా పోవడమే. ద్వితీయ శ్రేణి నేతలు కూడా చిన్న పని కోసం అయినా వాలంటీర్ల వద్దకు వెళ్లాల్సిందే. ఇది వైసీపీ క్యాడర్‌లో అసంతృరప్తికి కారణం అయింది. ఇక ఓ మాదిరి స్థాయి నేతలు.. తాము పార్టీ కోసం చాలా పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టుకున్నా.. ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని అసంతృప్తికి గురవుతున్నారు. కొంత మంది పనులు చేసినప్పటికీ బిల్లులు అందడం లేదు. గ్రామాల్లో పంచాయతీల అధికారాలు మొత్తం గ్రామ సచివాలయాలకే ఉండటంతో వైసీపీ అధినాయకత్వంపై గ్రామ స్థాయి నాయకత్వం కూడా అసంతృప్తిగా ఉంది. అందుకే క్యాడర్ ను పట్టించుకోవాలన్న సందేశాలు ఎక్కువగా ఆ పార్టీ హైకమాండ్‌కు అందుతున్నాయి. ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడంతో కనీస మౌలిక సదుపాయాల సమస్య కూడా వెంటాడుతోంది. రోడ్లు, మంచి నీరు వంటి విషయాల్లో గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక ఆర్ అండ్ బీ రోడ్ల సంగతి చెప్పాల్సిన పని లేదు. ఎన్నికల ఏడాదిలో ప్రజలకు సంబంధించి ఇలాంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎక్కువ సూచనలు వస్తున్నాయి. సంక్షేమం విషయంలోనూ మొదటి ఏడాది.. ఆ తర్వాత ఏడాది పథకాలు అందుకున్న లక్షల మందిని ఇప్పుడు అనర్హుల్ని చేశారని ఇప్పుడు వారందరికీ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి సమస్యలు పరిష్కరించుకుంటే... పరిస్థితి మెరుగవుతుందని అంటున్నారు. కారణం ఏదైనా అతి భారీ మెజార్టీతో గెలిచిన ప్రభుత్వానికి చాలా స్వల్ప కాలంలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్న అభిప్రాయం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా ప్రజల్లో బలపడుతోంది. దీన్ని తగ్గించుకోవాలంటే.. వైసీపీ పెద్దలు వ్యూహం మార్చుకోవాల్సిందేనని ఎక్కువ మంది నమ్ముతున్నారు. మరి ఆ పార్టీ హైకమాండ్ ఏం చేస్తుందో మరి !

## కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

కాకినాడ కాకినాడ జగన్నాథపురంలోని 18వ డివిజన్ లోని తూరంగిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారంలో రెండు కమ్యూనిటి హాల్స్ ను పూర్తి చేసుకొని ప్రారంభించుకోవడం జరిగిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు.కాకినాడ జగన్నాధపురంలోని తూరంగిపేటలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటి హాల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కుడా ఛైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మజ, వైకాపా నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్నసాగర్ లు రాగా డివిజన్ మాజీ కార్పోరేటర్ చవ్వాకుల రాంబాబు, డివిజన్ ఇన్ చార్జ్ ధోని చిట్టిబాబులు ఘన స్వాగతం పలికారు. నూతన కమ్యూనిటి హాల్స్ ను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ లో గడప గడప " కు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ 5 జోన్ ఏర్పాటుపై వివాదం

విజయవాడ, మార్చి 23, అమరావతి విషయంలో ఏపీ ప్రభుత్వం కోర్టులనూ లెక్క చేయడంలేదన్న విమర్శలు తాజాగా ఆర్ 5 జోన్ ఏర్పాటు విషయంలో వస్తున్నాయి. హైకోర్టు, రాజధాని ప్రాంత రైతుల అభ్యంతరాలు చెప్పినప్పటికీ అమరావతిలో స్థానికేతరులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఏపీ ప్రభుత్వం గెజిట్? నోటిఫికేసన్? విడుదల చేసింది. విజయవాడ, గుంటూరు నగరాలకు చెందిన పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రత్యేక జోన్ ఏర్పాటు చేసింది. ఇప్పటికే సీఆర్‌డీఏ చట్ట సవరణ చేసింది ప్రభుత్వం. తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలు, మంగళగిరి మండలంలోని కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు గ్రామాల పరిధిలో 900.97 ఎకరాల మేర పేదల ఇళ్ల కోసం జోనింగ్ చేస్తున్నట్టు ప్రకటించింది.ఎంపిక చేసిన భూముల ప్రాంతాన్ని ఆర్-5 జోన్‌గా పేర్కొంటూ గెజిట్? నోటిఫికేషన్? జారీ చేసింది. అమరావతి రాజధాని మాస్టర్ ప్లాన్‌లో కూడా ఈ మేరకు మార్పులు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. ఆర్-5 జోన్‌పై అభ్యంతరాలు, సూచనలు, సలహాలు స్వీకరించటానికి 15 రోజుల గడువు ఇచ్చింది. దీనిపై కొంతమంది హైకోర్టుకు వెళ్లారు. అంతకు ముందే ప్రభుత్వ చర్యలను హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. రాజధాని నిర్మాణం కోసం తీసుకున్న భూముల విషయంలో రైతులకు ఇచ్చిన హామీలకు, చేసుకున్న ఒప్పందాలకు భిన్నంగా వెళ్లటం తగదని, ఈ రకమైన చర్యలు చెల్లవని పేర్కొంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ఆర్-5 జోన్ ఏర్పాటు చేసింది.గతంలో సీఆర్డీఏ చట్టంలో నాలుగు జోన్లు మాత్రమే ఉన్నాయి. ఆర్-1 అంటే.. ప్రస్తుత గ్రామాలు, ఆర్-2 అంటే తక్కువ సాంద్రత గృహాలు ,ఆర్-3 అంటే తక్కువ నుంచి మధ్యస్థాయి సాంద్రత కలిగిన గృహాలు, ఆర్-4 అంటే హైడెన్సిటీ జోన్ పేర్లతో 4 రకాల నివాస జోన్ ఉండేవి. వీటికి అదనంగా ఐదో జోన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఐదోజోన్‌లో ? కృష్ణాయపాలెం, వెంకటపాలెం, నిడమర్రు, కురగల్లు, మందడం, ఐనవోలు గ్రామాల పరిధిలోని 967.25 ఎకరాలను నివాస ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. అందులోని 900.97 ఎకరాలను ఆర్-5 జోన్‌గా ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ చేసింది. ఇవన్నీ గతంలో కీలకమైన ప్రభుత్వ విభాగాలు ఏర్పాటు కోసం కేటాయించిన భూములు.సీఆర్డీఏ చట్టంలో ఎలాంటిమార్పులు చేయకూడదన్న కోర్టు తీర్పు ఉన్నా సీఆర్‌డీఏ చట్టంలో సవరణలు చేసింది ప్రభుత్వం. ఈ సవరణల ప్రకారం రెండు అధికారాలు సీఆర్‌డీఏకు, రాష్ట్ర ప్రభుత్వానికి వస్తాయి. రాజధానిలో పేదలకు ఇళ్ల పేరుతో స్థలాలు ఇవ్వడంతో పాటు రాజధాని భూములను టౌన్?షిప్?ల పేరుతో అమ్ముకోవటానికి, బదలాయించటానికి అధికారాలు సంక్రమిస్తాయి. అయితే దీనిపనా కోర్టులో పిటిషన్లు ఉన్నాయి. ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆర్5 జోన్ ఉత్తర్వులు చెల్లవని రైతులు అంటున్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టిస్తోందని ఆరోపిస్తున్నారు.

## జమాఆతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో రమజాన్ కిట్లు పంపిణీ...

### ప్రతి సహాయ కార్యం దైవ ప్రసన్నత కోసం కావాలి - రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరీముద్దీన్..

నంద్యాల ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా జమాఆతె ఇస్లామీ హింద్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రమజాన్లో కిట్లు పంపిణీ చేసారు. స్థానిక గోల్డెన్ బేకరిలో 10 కిలో బియ్యం, కంది బేడీలు, మంచి నూనె, కారం తదితర వెయ్యి రూపాయల విలువగల ఆహార నిత్యావసర వస్తువులు గల రెండువందల కిట్లు జమాఆతె ఇస్లామీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ కరీముద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణి చేసారు. స్థానిక అధ్యక్షులు అబ్దుల్ సమద్ అధ్యక్షతన నిర్వహించిన కిట్ల పంపిణీ లో సమద్ మాట్లాడుతూ నంద్యాల సేవా విభాగం దాతల నుండి సహకారంతో పేదలను గుర్తించి కిట్లు ఇస్తున్నట్లు తెలిపారు . ముఖ్య అతిథి కరీముద్దీన్ ముస్లిం ప్రజలకు రమజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ, సహనంతో ఓర్మితో రంజాన్ మాసంలో ఒదిగి పోవాలని, పేద ప్రజలను శక్తికొద్దీ ఆదుకోవాలని హితవు పలికారు. జమాత్ సేవలు దైవ భీతితో, దైవ ప్రసన్నతతో నిండి ఉంటాయని రాష్ట్ర వ్యాప్తంగా యాభై లక్షల పైబడి రమజాన్లో పేదల కోసం వెచ్చిస్తారన్నారు. ఈ కార్యం ఎంతో పవిత్రతతో నిర్వచిస్తారన్నారు. అనంతరం పేదలకు కిట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షబ్బీర్ హుసేన్, సేవా విభాగ కార్యదర్శి వి.సలీం, విశ్రాంత అధ్యాపకులు ఖాదర్ వలి, ఖిద్మత్ ముహమ్మద్ ఫయాజ్, ముహమ్మద్ యూనూస్, సద్దాం హుస్సేన్, పీ.వి.అఫ్రోజ్, దాదాపీర్, అబ్దుల్ సమద్ తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన పై దృష్టి పెట్టండి

### జిల్లా కలెక్టర్

తిరుపతి రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల పిల్లల, గర్భిణీ స్త్రీల ఆరోగ్య విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని అధికారులు శ్రద్ధ చూపాలని , సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన ధ్యేయంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మధ్యాహ్నం అమరావతి నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి వర్చువల్ విధానంలో పాఠశాల విద్య ,మహిళా శిశు సంక్షేమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, స్పందన అంశాలపై సమీక్ష నిర్వహించగా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్, అధికారులు హాజరయ్యారు. సి ఎస్ సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై సమీక్ష నిర్వహించారు. 0-5 సంవత్సరాల చిన్నపిల్లల ఆధార్ నమోదు జిల్లాలో 58 శాతం పూర్తి అయిందని, పిల్లల ఆరోగ్యం ప్రధానం ,పిల్లలకు అంగన్ వాడి నుండి సంపూర్ణ పోషణ అందించడానికి ఆధార్ అవసరమని అవగాహనతో సచివాలయ సిబ్బంది వీరి ఆధార్ నమోదు కు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తిచేయాలని సూచించారు. గర్భిణి స్త్రీల లో పోషకాహార లోపం తగ్గించడానికి అవసరమైన ఐరన్ మాత్రల పంపిణీ సక్రమంగా అందేలా చూడాలని తరచూ పర్యవేక్షణ వుండాలని అన్నారు. బడి పిల్లల్లో పోషకాహార లోపం గుర్తించిన వారికి అదనపు పౌష్టి కాహారం అందించాలని, ఇప్పుడు రాగి జావ అదనంగా అందిస్తున్నామని సక్రమంగా పిల్లలు తీసుకునేలా పర్యవేక్షణ వుండాలని సూచించారు. బడి పిల్లలు బడి మానకుండా చూడాలని చూడాలని సూచించారు. ఎన్నికల కోడ్ వల్ల ఆలస్యమైన అంగన్ వాడి ల్లో ప్రమోషన్స్, ఖాళీల భర్తీ కి నోటిఫికేషన్ వంటివి పూర్తి చేయాలని ఐ సి డి ఎస్ పి డి ని ఆదేశించారు. పాఠశాలల్లో సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ తరచూ జరగాలి, గుర్తించిన లోపాలు , పునరుద్దరణ చేపట్టి పరిష్కరించిన అంశాలు హెచ్ ఎం లు ఎప్పటికప్పుడు యాప్ లో అప్ లోడ్ చేయాలని ఎం. ఈ. ఓ లు పర్యవేక్షణ వుండాలని అన్నారు. స్పందన అందిన అర్జీలు సకాలంలో అర్థవంతంగా పరిష్కరించాలని అన్నారు. ఒక్క అర్జీ కూడా అర్థవంత పరిష్కారం జరగలేదని తిరిగి స్పందనలో ఓపెన్ కారాదని సూచించారు. ఈ సమీక్షలో పాల్గొన్న డి ఎల్ డి ఓ సుశీల దేవి, డి ఇ ఓ శేఖర్, డి ఎం హెచ్ ఓ శ్రీహరి, పిడి ఐ సి డి ఎస్ జయలక్ష్మి, ఎస్. సి . సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, బి. సి. సంక్షేమ అధికారి భాస్కర్ రెడ్డి, డి సి హెచ్ ఎస్ ప్రబావతమ్మ, జిల్లా ప్రణాళిక అధికారి అశోక్ కుమార్, జి ఎస్ దబ్ల్యు ఎస్ కోఆర్డనేటర్ జగదీష్, ఎస్. బి. కోఆర్డనేటర్ సతీష్, డాక్టర్ హర్షవర్ధన్ అధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో సరే కానీ.. గల్లీలో మాత్రం...

విజయవాడ, మార్చి 23, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ – జనసేన మేధ్య పొత్తు విషయం క్లైమాక్స్ కు వచ్చినట్లుగా కనిపిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి ఓటేయవద్దు అని పవన్ పిలుపునిచ్చారు కానీ బీజేపీకి ఓటేయమని చెప్పలేదు. అందుకే ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఉందా లేదా అన్న డౌట్ అందరికీ వచ్చింది. గత కొన్నాళ్లుగా జరుగుతున్న పరిణామాలు చూస్తే మోదీ, అమిత్ షా అంటే గౌరవం కానీ ఏపీ బీజేపీ నేతలంటే మాత్రం ఇష్టం లేదన్నట్లుగా పవన్ మాట్లాడుతున్నారు. పవన్ మాటల్ని బట్టి చూస్తే ఢిల్లీ వరకూ బీజేపీకి మద్దతుగా ఉంటాం.. రాష్ట్రంలో మాత్రం వద్దని రాజకీయవర్గాలు ఓ అంచనాకు వస్తున్నాయి. దానికి తగ్గట్లుగానే అటు బీజేపీ కానీ ఇటు పవన్ కానీ కలిసి నడిచేందుకు ఏ మాత్రం ప్రయత్నం చేయలేదు. చివరికి అది బంధం తెగిపోయే దశకు చేరుకుంది. సాధారణంగా రాజకీయ పొత్తులు అనేవి ఎన్నికల సమయంలోనే ఉంటాయి. ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ కమ్యూనిస్టు పార్టీలు, బీఎస్పీతో కలిసి వెళ్లారు. ఎన్నికల్లో దారుణ పరాజయం ఎదురైంది. చివరికి రెండు చోట్ల తాను కూడా గెలవలేదు. దీంతో వెంటనే రియలైజ్ అయ్యారు. ఏపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీసుకున్న నిర్ణయాలతో ఇసుక కొరత ఏర్పడటం.. మూడు రాజధానుల నిర్ణయంతో ప్రజా వ్యతిరేకత గుర్తించి వెంటనే రంగంలోకి దిగారు. విశాఖలో కవాతు నిర్వహించారు. అమరావతిలోనూ నిర్వహించాలనుకున్నారు. తేదీ ప్రకటించారు. కానీ అనూహ్యంగా ఢిల్లీ వెళ్లి బీజేపీతో పొత్తు ప్రకటన చేశారు. అసలు ఎన్నికలు అయిపోయాక ఈ పొత్తు ప్రకటనేంటో చాలా మందికి అర్థం కాలేదు. కానీ పవన్ నిర్ణయం తీసుకున్నారు కదా అని ఫాలో అయిపోదామనుకున్నారు. కానీ అలా పొత్తు ప్రకటన చేసిన తర్వాత కలిసి చేయాల్సిన ఉద్యమాలు కాస్తా పూర్తిగా ఆగిపోయాయి. జనసేన ప్రకటించిన కవాతు కూడా జరగలేదు. ఓ సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకుని కలిసి పని చేద్దామనుకున్నారు కానీ.. ఆ కమిటీలు కాదు కదా ఏమీ లేవు. పొత్తు ప్రకటన చేశారు కానీ.. కలిసి పని చేసిందే లేదు. తిరుపతి లోక్ సభ సభ్యుడు మృతి చెందడంతో వచ్చిన ఉపఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ సిట్టింగ్ సభ్యుడి కుటుంబసభ్యులకు టిక్కెట్ ఇవ్వకపోవడంతో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి పోటీ చేయాలని జనసేన అనుకుంది. కానీ బీజేపీ జరుగుతోంది లోక్ సభ ఎన్నికలు కాబట్టి బీజేపీకి చాన్సివ్వాలని పట్టుబట్టింది. రెండు సార్లు ఢిల్లీ పర్యటనల తర్వాత పవన్ కల్యాణ్ .. బీజేపీకి సీటు ఇచ్చారు. మాజీ ఐఏఎస్ అధికారికి టిక్కెట్ ఇచ్చి రంగంలోకి దింపారు. పవన్ కల్యాణ్ కూడా ప్రచారం చేశారు. కానీ ఏడు నియోజకవర్గాల్లో కలిపి కేవలం 57వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. డిపాజిట్ రాలేదు. అంతకు ముందు సాధారణ ఎన్నికల్లో బీజేపీకి 16 వేల ఓట్లు వచ్చాయి. జనసేన కలిసిన తర్వాత మరో 30 వేల ఓట్లు పెరిగాయి. నిజానికి పవన్ కల్యాణ్ కు మద్దతిచ్చే వర్గం ఎక్కువగా ఆ ప్రాంతంలో ఉందని చెప్పుకుంటారు. కానీ ఆ స్థాయిలో ఓట్లు రాలేదు. దీంతో బీజేపీ, జనసేన పొత్తు వర్కవుట్ కావడం లేదన్న అభిప్రాయం ప్రారంభమయింది. తర్వాత స్థానిక ఎన్నికల్లో బీజేపీ, జనసేన పొత్తులపై చర్చించుకోలేదు. కనీసం పొత్తులు పెట్టుకోవాలన్న ఆలోచన కూడా చేయలేదు. ఎవరికి వారు పోటీ చేసుకున్నారు. కోస్తాలో కొన్ని చోట్ల టీడీపీ, జనసేన స్థానిక నాయకత్వాలు పొత్తులు పెట్టుకుని పోటీ చేసి మంచి ఫలితాలు సాధించాయి. ఓ ఎంపీపీ పదవిని..జడ్పీటీసీని సొంతం చేసుకున్నాయి. అప్పట్నుంచే టీడీపీ, జనసేన పొత్తులపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఏపీ బీజేపీకి ఉన్న బలం స్వల్పమే అయినా నేతల మధ్య ఆధిపత్య పోరాటానికి మాత్రం కొరతే లేదు. సోము వీర్రాజుకు వ్యతిరేకంగా ఓ బలమైన గ్రూప్ ఏర్పడింది. సోము వీర్రాజు పార్టీ నేతల్నే కాదు జనసేననూ పట్టించుకోలేదని.. కనీసం సమన్వయం చేసుకునే ప్రయత్నం చేయలేదన్న విమర్శలు వచ్చాయి. ఇలా ఎలా చూసినా.. జనసేన చొరవ తీసుకుని మరీ పొత్తులోకి వచ్చినా...జనసేనతో మైత్రిని కొనసాగించుకుని పరస్పర లబ్ది పొందాల్సిన పార్టీలు రెండూ నష్టపోయాయి. ఆవిర్భావసభలో పవన్ అదే చెప్పారు.. బీజేపీ సహకరించి ఉంటే.. టీడీపీ అవసరం ఎదిగేవాళ్లమని. కానీ ఆ అవకాశం చేజారిపోయింది. ఇప్పుడు బీజేపీ నేతలు ఏం అనుకున్నా ప్రయోజనం లేని స్థితికి చేజారిపోయింది.

# ఆ ముగ్గురే కారణమా...

విశాఖపట్టణం, మార్చి 23,మూడు రాజధానులు పనిచేయలేదు. మూడు ప్రాంతాల్లో ఫ్యాన్ తిరగలేదు. మూడు చోట్ల అధికార వైసీపీ అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టాయి. ఇదేం రిజల్ట్? ఎన్నికల్లో అవతవకలు.. ఇవన్నీ కుంటిసాకులే. ఎన్ని పొరపాట్లు... మూడు ప్రాంతాలకు ముగ్గురు కన్వీనర్లు. ముగ్గురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారే. ఒకరు సజ్జల రామకృష్ణారెడ్డి, ఇంకొకరు వైవీ సుబ్బారెడ్డి, మరొకరు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. ముగ్గురు ఆప్తులను నియమించుకున్నారు. నమ్మకమైన వారే కనుక తనకు ఇబ్బంది ఏమీ ఉండదని జగన్ భ్రమించారు. కానీ ఏమయింది? ఫ్యాన్ రివర్స్ లో తిరిగింది. నాలుగేళ్లుగా నెత్తీ నోరు మొత్తుకుంటున్నా నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలు సమసి పోలేదు.విభేదాలను పరిష్కరించే సమయం, తీరిక రెండూ జగన్ కు లేవు. అందుకే ఆ ముగ్గురి మీదనే భారం పెట్టారు. వారిపైనే పూర్తిగా వదిలేశారు. నేతల మధ్య సమన్వయం తనను చూసే వస్తుందనుకున్నారు. తాను తెచ్చే ఫలితాలే అన్నీ సెట్ చేస్తాయని జగన్ భ్రమించారు. కానీ చివరకు ఏం జరిగింది? గెలవాల్సిన ఎన్నికల్లో చతికలపడాల్సి వచ్చింది. విభేదాలు పరిష్కరించలేని ఆ ముగ్గురి నేతలను నిందించాలా? లేక నిర్లక్ష్యం, అతి విశ్వాసాన్ని ప్రదర్శించిన జగన్ ను అనాలా? అన్నది ఫ్యాన్ పార్టీ అసలైన కార్యకర్తకు అంతుపట్టడం లేదు. నేతలు బాగానే ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్త మాత్రమే ఈ ఓటమికి బాధపడుతున్నారు. జీర్ణించుకోలేకపోతున్నాడు. వై నాట్ 175 నినాదం వినిపించడానికి బాగానే ఉన్నా... కిందిస్థాయిలో అది లేదన్నది జగన్ గుర్తించ లేకపోయారు.ఇక గత నాలుగేళ్లుగా 2019 ఎన్నికల్లో పనిచేసిన ముఖ్య కార్యకర్తలను పార్టీ నేతలు ఎక్కడ పట్టించుకున్నారు? ఇదీ వారి నుంచి ఎదురవుతున్న ప్రశ్న. నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు అసలైన కార్యకర్తలను వదిలేశారు. తమ సొంత నిధులను ఖర్చు పెట్టి జగన్ ను గెలిపించడం కోసం పనిచేసిన కార్యకర్తలు కూడా నాలుగేళ్లుగా గోళ్లు గిల్లుకుంటున్నారు. ఈ విషయం హైకమాండ్ కు తెలియంది కాదు. పీకే టీం ముందే హెచ్చరించింది. అందుకే నియోజకవర్గాల వారీగా జగన్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం జరిపారు. కానీ ఆ సమావేశంలోనూ ఆయన ఏం చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అభ్యర్థి ఈయన.. ఆయననే గెలిపించుకు రావాలంటూ పిలుపునిచ్చారు తప్పించి వారి నుంచైనా రియల్ ఫీడ్ బ్యాక్ ను తీసుకోవడానికి ప్రయత్నించారా? అన్న ప్రశ్న తలెత్తుతుంది.ఓటర్లను గుర్తించి పోలింగ్ బూత్ వరకూ తీసుకెళ్లే బాధ్యత జెండా పట్టుకున్న కార్యకర్త మాత్రమే తీసుకుంటాడు. కానీ వారు కొన్నాళ్లుగా సైలెంట్ అయిపోయిన విషయాన్ని జగన్ సకాలంలో గుర్తించినా అందుకు తగిన చర్యలు తీసుకోలేక పోయారు. ఎమ్మెల్యేలను మందలించలేకపోయారు. తన పథకాల వల్లనే గెలుస్తారన్న ధీమా తప్ప కార్యకర్తలే రేపటి ఎన్నికలకు కూడా ముఖ్యమని జగన్ ఎందుకు గుర్తించలేకపోయారు. ఇదీ సగటు వైసీపీ కార్యకర్త వేస్తున్న ప్రశ్న. ఇప్పటికైనా మించిపోయింది లేదు.. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కనుక యాక్టివ్ చేయగలిగితే తిరిగి పుంజుకోవచ్చు. కానీ అది మన సీఎం సర్ కు ఉండాలి గా. ఎందకంటే ఆయన ముఖ్యమంత్రి. ఎవరితో మాట్లాడే ఓపిక, తీరిక ఆయనకుండదు.

# పంచుమర్తి ఎన్నికపై టెన్షన్...

విజయవాడ, మార్చి 23, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఎలాంటి అడుగు వేసినా అందుకు ఒక రాజకీయ ప్రయోజనం ఉంటుంది. రాజకీయాలను వడపోసిన చంద్రబాబు ఏ నిర్ణయమూ అంత సులువుగా తీసుకోరు. అందుకే ఆయన నలభై ఏళ్ల నుంచి రాజకీయాలు కంటిన్యూగా చేస్తూనే ఉన్నారు. ఎక్కువ రోజులు పనిచేసిన ముఖ్యమంత్రిగా కూడా రికార్డుల కెక్కారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి పార్టీని చేతులోకి తీసుకున్నా దానిని మూడు దశాబ్దాల నుంచి విజయవంతంగా నడపటం ఆయనకే సాధ్యం. ఇది చంద్రబాబుపై పొగడ్తలు కావు. ఆయనకున్న రాజకీయ సమర్థత. పాలిటిక్స్ పై ఆయనకున్న గ్రిప్‌ను తెలియజేయడానికి మాత్రమే. అందుకే ప్రత్యర్థులు ఎవరూ చంద్రబాబును అంత ఆషామాషీగా తీసుకోవడానికి వీలులేదు.చంద్రబాబు ప్రతి నిర్ణయం వెనక పార్టీ ప్రయోజనం దాగి ఉంటుంది. భవిష్యత్ లో ఉపయోగపడే నిర్ణయాలనే ఆయన తీసుకుంటారన్నది పార్టీలో ప్రతి ఒక్కరికీ తెలుసు. అందుకే ఆయన నేతృత్వంలో పార్టీ 2019 ఎన్నికల్లో దారుణంగా ఓటమి పాలయినా కేవలం నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే పార్టీని వీడారు. ఆ ఒక్కటి చాలు ఆయనపై పార్టీ నమ్మకానికి ఉదాహరణ. ఇక తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థిని బరిలోకి దింపారు. ఎమ్మెల్యే కోటాలో ఆయనకున్న ఎమ్మెల్యేలు కేవలం 19 మంది మాత్రమే. అయినా రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి మాత్రమే ఎన్నికలకు వెళుతున్నారు. మొత్తం ఏడు ఎమ్మెల్సీలకు గాను ఎనిమిది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గెలవాలంటే 23 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. పార్టీని వీడిన నలుగురు ఎమ్మెల్యేలు ఓటు వేస్తారన్న నమ్మకం లేదు. అంటే 19 మంది టీడీపీ ఒరిజినల్ కౌంట్. ఇక వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలుగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఓట్లు ఎటూ తమ అభ్యర్థికి వచ్చినా 21కే పరిమితం అవుతారు. కానీ మరో ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు అవసరం. అయితే ఎన్నికల్లో ఏదైనా జరగొచ్చు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు గైర్హాజరయినా, హైకమాండ్‌పై అసంతృప్తితో తమకు ఓటు వేసినా టీడీపీ అభ్యర్థి గెలిచే అవకాశముంది. కానీ అది ఆశమాత్రమే. అదినెరవేరుతుందన్న గ్యారంటీ అయితే లేదు కాని, ఒక ప్రయత్నం మాత్రం చంద్రబాబు చేశారనే చెప్పాలి.విజయవాడ మాజీ మేయర్ పంచుమర్తి అనూరాధను పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. అయితే ఈ ఎంపికలోనూ చంద్రబాబు దూరదృష్టి ఉంది. పంచుమర్తి అనూరాధ బీసీ సామాజికవర్గానికి చెందిన నేత.

పద్మశాలి సామాజికవర్గానికి చెందిన వారు. ఇప్పటికే జగన్ ఆ సామాజికవర్గానికి ఎమ్మెల్సీ పదవితో పాటు నామినేటెడ్ పదవులు ఇచ్చారు. మంగళగిరిలో ఆ సామాజికవర్గం ఓట్లు ఎక్కువ. చంద్రబాబు తమ సామాజికవర్గానికి చెందిన వారికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని అక్కడి ప్రజలు వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు లోకేష్ కు అండగా నిలబడే అవకాశముంది. రాష్ట్రంలో బీసీలు కూడా కొంత సానుకూలంగా స్పందించే వీలుంటుంది. గెలిస్తే వెల్ అండ్ గుడ్. లేకుంటే చంద్రబాబు ఇచ్చినా తమ పార్టీ పట్ల సానుభూతి వచ్చే అవకాశముందన్నది చంద్రబాబు లెక్క. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏరి కోరి అనూరాధను ఎంపిక చేశారన్నది వాస్తవం. సరే ఓటమి చెందవచ్చు. విజయం సాధించవచ్చు. గెలిస్తే ఓకే. ఓడినా భవిష్యత్ లో లోకేష్ ఖాతాలో కొన్ని ఓట్లయినా పడటానికి ఈ ఎంపిక ఉపయోగపడుతుంది. చూద్దాం మరి ఏం జరుగుతుందో.

# అంగట్లో అమ్మకానికి 16.8 కోట్ల మంది డేటా.. ఆరుగురి అరెస్టు



హైదరాబాద్: వ్యక్తిగత డేటా సేకరించి విక్రయిస్తున్న ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా 16.8కోట్ల మందికి సంబంధించిన డేటా చోరీ చేశారని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు.పలు ఆన్‌లైన్ వెబ్‌సైట్ల నుంచి డేటాను చోరీ చేసి ఈ ముఠా సైబర్ నేరగాళ్లకు అమ్ముతున్నట్లు వెల్లడించారు. పాన్ ఇండియా ప్రభుత్వ ఉద్యోగులు, పలు బ్యాంకింగ్ క్రెడిట్ కార్డులు, పాన్ కార్డ్, పాలసీ బజార్ వంటి పేరున్న సంస్థల నుంచి డేటా చోరీ అయిందని చెప్పారు. ఈ మేరకు సైబరాబాద్ సీపీ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.”బీమా, రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల సమాచారం తస్కరించినట్లు గుర్తించాం. ఫేస్‌బుక్ యూజర్ల ఐడీ, పాస్‌వర్డ్‌లు, ఐటీ ఉద్యోగుల డేటాను సైతం చోరీ చేశారు. డిఫెన్స్, ఆర్మీ ఉద్యోగుల డేటా అంగట్లో అమ్మకానికి పెట్టారు. మహిళల వ్యక్తిగత డేటానూ సైబర్ నేరగాళ్లకు అమ్ముతున్నారు. ఇది దేశ భద్రతకు పెను ముప్పు. సైబరాబాద్ పరిధిలో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నాం. ఈ వ్యవహారంలో బ్యాంక్ ఆఫ్ బరోడా క్రెడిట్ కార్డ్ జారీ చేసే ఓ ఏజెన్సీ ఉన్నట్లు గుర్తించాం. దీనికి సంబంధించి జస్ట్ డయల్ సంస్థపై కూడా కేసులు నమోదు చేస్తాం. గతంలో ఇలాంటి కేసులు మా దృష్టికి వచ్చాయి. వీరి వెనుక ఎవరున్నారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం. నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారిస్తాం” అని సీపీ తెలిపారు.

# ముచ్చెమటలు పట్టిస్తున్న అమృత్ పాల్

ఛండీఘడ్, మార్చి 23, వారీస్ పంజాబ్ దే అధినేత అమృత్ పాల్ సింగ్ గత కొన్ని రోజులుగా పంజాబ్ పోలీసులకు చెమటలు పట్టిస్తున్నాడు. వేషాలు మార్చుకుంటూ వివిధ ప్రాంతాల్లోకి పారిపోతూ ముప్పు తిప్పలు పెడుతున్నాడు. అయితే తాజాగా అమృత్ పాల్ కు చెందిన ఓ ఫోటో సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేస్తోంది. ఆ చిత్రంలో అమృత్ పాల్ సింగ్ ఓ బండిపై తన బైక్ ని తీసుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. అమృత్ పాల్ సింగ్ ను పట్టుకునేందుకు పోలీసులు ఏకంగా ఓ ఆపరేషన్ నే ప్రారంభించారు. దాదాపు ఆరు రోజుల నుంచి అమృత్ పాల్

తప్పించుకు తిరుగుతున్నాడు. గత శనివారం తన కాన్వాయ్ లో వస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో బైక్ పై పారిపోయాడు. అప్పటి నుంచి పోలీసులు అతని కోసం వెతుకుతూనే ఉన్నారు.ఇప్పటివరకు అతనికి సంబంధించిన 100 మందిని అరెస్టు చేశారు. అమృత్ పాల్ ను ఇప్పటివరకు అదుపులోకి తీసుకోకపోవడంతో పంజాబ్ హైకోర్టు కూడా అధికార ప్రభుత్వంపై విమర్శలు చేసింది. వేలాది మంది పోలీసులు ఉండి? అమృత్ పాల్ ను పట్టకోవడానికి ప్లాన్ వేసినప్పటి అతడు తప్పించుకోవడం ఇంటిలిజెన్స్ ఫెయిల్యూర్ అని ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు పంజాబ్ లో శాంతి, సామరస్యాలకు విఘాతం కలిగించేవారని ఎవ్వరినీ వదిలిపెట్టమని..వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని ఇటీవల పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ తెలిపారు.

# ప్రచార రథాల ద్వారా ధర్మ ప్రచారం

విజయవాడ, మార్చి 23,రాష్ట్ర వ్యాప్తంగా హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా ఏడు ప్రముఖ దేవాలయాల ప్రచార రథాల ద్వారా పెద్ద ఎత్తున ధర్మ ప్రచార కార్యకమాన్నిచేపట్టనున్నట్టు దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ధార్మిక పరిషత్ కమిటీ 3వ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ దేవాలయాల్లో రోజువారీ జరగాల్సిన నిత్య పూజా కార్యక్రమాలన్నీసక్రమంగా జరగాలని ఆ విషయంలో ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవాలయాలకు చెందిన అనగా సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గ, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం దేవాలయాల ప్రచార రథాల ద్వారా హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాన్నిచేపడు తున్నట్టు చెప్పారు. ప్రజల్లో హిందూ ధర్మ పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలను, నైతిక విలువలను పెంపొందించడం, కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యతను చాటి చెప్పడమే లక్ష్యంగా ఈ ధర్మప్రచార కార్యక్రమాన్నినిర్వహిస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. విధంగా సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అంశంపైన పురాణ ఇతిహాసాలకు సంబంధించి చిన్నచిన్నపుస్తకాలను ప్రచురించి ప్రజలకు పంపిణీ చేయడం ద్వారా వారిలో హిందూ ధర్మ పరిరక్షణపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. ఈ ప్రచార రథాలు ఆయా గ్రామాలు, పట్టణాల సందర్శనకు సంబంధించిన తేదీలు, సమయాలు ముందుగానే తెలియజేసి వివిధ దేవాలయాలు, ఆధ్యాత్మిక సంస్థలు, ఆధ్యాత్మికవేత్తలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ అధికారులకు సూచించారు. ప్రతి ప్రచార రథానికి ఒక బృందాన్ని ఏర్పాటు చేసి వారి ద్వారా ఈ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.రాష్ట్ర శ్రేయోభివృద్ధే లక్ష్యంగా అనగా సంపద,రక్షణ,శక్తి పెంపొందాలనే ఆశయంతో విజయవాడలో లక్ష్మీ సుదర్శన రాజశ్యామల సుదర్శన సహిత మహాలక్ష్మీ యజ్ఞాన్ని నిర్వహించాలని సంకల్పించామని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. దీనికి సంబంధించి ఈ సమావేశంలో పాల్గొన్న ఆగమ, జ్యోతిష్య పండితుల నుంచి పలు సూచనలు, సలహాలు స్వీకరించారు. వీడియా లింక్ ద్వారా పెద్ద జియంగార్ పీఠాధిపతి, పుష్పగిరి పీఠాధిపతితోపాటు టిటిడి ఇఓ ధర్మారెడ్డి పాల్గొని ఈ యజ్ఞం నిర్వహణకు సంబంధించి పలు సూచనలు సలహాలు అందించారు. ఈయజ్ఞం నిర్వహణకు సంబంధించిన తేది, ముహూర్తం తదితర ఏర్పాట్లపై దేవాదాయశాఖతోపాటు సంబంధిత శాఖల సమన్వయం తో తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం మాట్లాడుతూ హిందూ ధర్మప్రచార కార్యక్రమం, త్వరలో నిర్వహించనున్నయజ్ఞం నిర్వహణకు సంబంధించి పలు సూచనలు, సలహాలను అందించారు.

# కాసులు కురిపిస్తున్న జరిమానాలు

విజయవాడ, మార్చి 23, రైళ్లలో టిక్కెట్లు లేకుండా జర్నీ చేసే వారి సంఖ్య తక్కువేమి కాదు. దక్షిణాది రాష్ట్రాల్లో కాస్త తక్కువే కాని ఉత్తరాది రాష్ట్రాల్లో అయితే టిక్కెట్ కొని ప్రయాణించడాన్ని నేరంగా చూసే రాష్ట్రాలు కూడా ఉన్నాయి. వాటి సంగతెలా ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో మాత్రం టిక్కెట్లు లేని రైలు ప్రయాణికుల నుంచి కోట్లాది రుపాయలు జరిమానాలు వసూలు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కొంతమంది సిబ్బంది కోట్లలో జరిమానాలు కూడా వసూలు చేశారు.విజయవాడ రైల్వే డివిజన్‌కు చెందిన ఎంజె.మాథ్యూ అనే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ గుడివాడ స్క్వాడ్‌లో పనిచేస్తున్నారు. ఏడాది కాలంలో ఈయన అక్షరాలా కోటి రెండు లక్షల రుపాయల జరిమానాలు వసూలు చేశారు. టిక్కెట్లు లేకుండా ప్రయాణించే వారిని గుర్తించి వారికి జరిమానాలు విధించడంతో పాటు, నిర్ణీత పరిణామం కంటే ఎక్కువగా లగేజీ తీసుకెళ్తున్న వారిని గుర్తించి ఈ జరిమానాలు విధించారు.ఎంజె.మాథ్యూ మొత్తం 12,707 కేసులు నమోదు చేశారు. అనధికారిక ప్రయాణికులతో పాటు రైలు ప్రయాణ ఉల్లంఘనలపై ఈ కేసులు నమోదు చేశారు. రైలు ప్రయాణ నిబంధనల్ని ఉల్లంఘించిన వారిపై కొరడా ఝుళిపించడం ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయాన్ని తెచ్చి పెట్టారు. వీటిలో 5810 కేసులు టిక్కెట్టు లేకుండా ప్రయాణిస్తున్న వారిపై నమోదు చేశారు. వారి నుంచి రూ.61.02లక్షల జరిమానాలు వసూలు చేశారు. దీంతో పాటు అనధికారిక ప్రయాణాలపై 6900 కేసులు నమోదు చేశారు. వీటి ద్వారా రూ.41.33లక్షల జరిమానాలు వసూలు చేశారు.35ఏళ్ల కెరీర్‌లో మాథ్యూ జిఎం అవార్డుతో పాటు డిఆర్ఎం అవార్డు, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ అవార్డులు పొందారు. అత్యధిక కేసులు నమోదు చేసిన అధికారికి జిఎం నుంచి అభినందనలు దక్కాయి.మరోవైపు సికింద్రబాద్ రైల్వే డివిజన్‌లో కూడా మరో ఏడుగురు అధికారులు కోటికి పైగా జరిమానాలు వసూలు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేవలం తొమ్మిది మంది రైల్వే తనిఖీ సిబ్బంది ఏకంగా రూ.9.62 కోట్లు వసూలు చేశారు. సగటున ఒక్కొక్కరూ రూ.కోటిని మించి వసూలు చేశారన్నమాట.టికెట్ లేకుండా ప్రయాణించేవారు, ముందస్తు బుకింగ్ లేకుండా సామగ్రి తరలించేవారిని గుర్తించి అపరాధ రుసుము వసూలు చేయటంలో తొమ్మిది మంది టికెట్ తనిఖీ సిబ్బంది చురుగ్గా వ్యవహరించి పెద్దమొత్తంలో పెనాల్టీ వసూలు చేశారు.ఒక్కో అధికారి రూ.కోటికిపైగా పెనాల్టీ వసూలు చేయటం రైల్వే చరిత్రలోనే తొలిసారి కావటం విశేషమని రైల్వే అధికారులు చెబుతున్నారు. సికింద్రాబాద్ డివిజన్ నుంచి ఏడుగురు, గుంతకల్, విజయవాడ డివిజన్ల నుంచి ఒక్కొక్కరి చొప్పున ఈ ఘనత సాధించారు. సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ నటరాజన్ 12,689 మంది ప్రయాణికుల నుంచి ఏకంగా రూ.1.16 కోట్లు వసూలు చేశారు. వీరిని దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్ విజయవాడలో ప్రత్యేకంగా అభినందించారు.

# కుప్పకూలిన భవనం.. ముగ్గురు దుర్మరణం

విశాఖపట్టణం, మార్చి 23, (న్యూస్ పల్స్)విశాఖపట్నంలో ఉగాది పండగ పూట విషాదం నెలకొంది. కలెక్టరేట్ సమీపంలోని రామజోగి పేటలో మూడంతస్తుల భవనం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ దుర్ఘటనలో భవన శిథిలాల కింద చిక్కుకుని ఇప్పటివరకు ముగ్గురు మృతి చెందారు. వీరి సంఖ్య పెరిగేటట్లు తెలుస్తోంది. శిథిలాల కింద చిక్కుకుని ఉన్న మరో ఆరుగురిని రక్షించి స్థానికులు, రెస్క్యూ సిబ్బంది కేజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పురాతన భవనం కూలినట్టు ప్రాథమిక నిర్ధారణలో తేలింది. భవనం ఒక్కసారిగా కుప్పకూలిన శబ్ధాలకు పరిసర ప్రాంత ప్రజల భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. బిల్డింగ్ కుప్పకూలడంతో బాలిక సాకేటి అంజలి (15) అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. రామకృష్ణ మిషన్ స్కూల్లో పదో తరగతి చదువుతోంది అంజలి. ప్రస్తుతం ఆమె సోదరుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. శిథిలాలలో మరో యువకుడు కూడా చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఉ+ 2 భవంతిలో రెండు కుటుంబాలతో పాటు ఇద్దరు బ్యాచిలర్స్ నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. భవనం లో మొత్తం 9 మంది ఉన్నట్టు సమాచారం అందుతోంది. వారిలో వారిలో అంజలి చనిపోగా మరో ఆరుగురిని కేజీహెచ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరో ఇద్దరి కోసం రెస్క్యూ ఆపరేషన్ చేస్తున్నారు ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది. కాగా అంజలి పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంది. ఇంతలోనే ఈ దుర్ఘటన జరగడం కుటుంబ సభ్యులకు తీరని వేదనను మిగుల్చుతోంది. దీంతో అంజలి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. కాగా శిథిలాల నుంచి మరొక మృత దేహం వెలికితీశారు. గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న నూడిల్స్ షాప్ సహాయకుడిని చోటుగా గుర్తించారు. బిహార్ కు చెందిన చోటు వయసు 30 సంవత్సరాలు. మృతదేహాన్ని కేజీహెచ్ కు తరలించారు.

గ్రౌండ్ ఫ్లోర్

1) కొమ్మిశెట్టి శివశంకర్ (29)నూడిల్స్ మాస్టర్ గా పని చేస్తున్నాడు. సొంత ఊరు విజయవాడ దగ్గర ఉన్న కృష్ణలంక, గత వారం రోజుల నుంచి మాత్రమే ఆ ఇంట్లో ఉంటున్నట్టు స్థానికులు తెలిపారు.

2) చోటు బిహార్ కి చెందిన వ్యక్తి కూడా ఉంటున్నాడు

ఫస్ట్ ఫ్లోర్

1) సాకేటి రామారావు (39)

2) సాకేటి కళ్యాణి. ఈమె ఆయుష్మాన్ హాస్పిటల్ లో స్టాఫ్ నర్స్ గా పని చేస్తుంది.

3) సాకేటి దుర్గాప్రసాద్. ఇంటర్మీడియట్ సెకండియర్ ఆచారి కాలేజీలో చదువుతున్నాడు.

4) సాకేటి అంజలి (16) రామకృష్ణ మిషన్ స్కూల్లో టెన్త్ క్లాస్ చదువుతుంది.

సెకండ్ ఫ్లోర్

1) సన్నాపు కృష్ణ (30) సొంత ఊరు బొమ్మ లక్ష్మీపురం దగ్గర ఉన్న దుమ్మరి గ్రామం, అరవింద్ క్యాటరింగ్ దండ బజార్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

2) పాతిక రోజా రాణి (29) ఆయుష్మాన్ హాస్పిటల్ లో ఐసీయూలో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

## అదుపుతప్పిన కారు..ఇద్దరు అక్కడికక్కడేమృతి

విశాఖపట్నం విశాఖపట్నం జిల్లా భీమిలి వలంద పేట జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక వ్యాగనార్ కారు బీభత్సం సృష్టించింది. డ్రైవర్ నిద్ర మత్తులో వుండడంతో కారు డివైడర్ ను ఢీకొని తరువాత ఒక బస్సును ఒక లారీ ని ఢీకొంది. ఘటనలో కారు లో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు శ్రీకాకుళం జిల్లా కు చెందిన లాడే దుర్గాప్రసాద్,పట్నాల సంతోష్ గా గుర్తించారు. మృతదేహాలను కేజీహెచ్ మార్చురీకి తరలించారు. భీమిలీ పోలీసులు కేసు నమోదు చేసారు.

# సమాజంలో మార్పుకోసం భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం

**సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి వీరశేఖర్**

బద్వేలు భారత కమ్యూనిస్టు పార్టీ బద్వేల్ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక భగత్ సింగ్ నగర్ లో ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు భారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను పూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి. వీరశేఖర్ అన్నారు. సర్దార్ భగత్ సింగ్ 92 వ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 28 న లాహోర్ సమీపంలోని బంగా అనే గ్రామంలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించారని, జాతీయ భావాలు, పోరాట సాంప్రదాయం కలిగిన కుటుంబం సర్దార్ భగత్ సింగ్ ది అని అన్నారు. బ్రిటిష్ వలసదారుల దోపిడీ పరిపాలనను పారదోలి భారతదేశాన్ని విముక్తి చేయడం కోసం జరిగిన జాతీయ ఉద్యమంలో అనేకమంది బలిదానాలు చేశారని, అందులో విప్లవ విద్యార్థి యువజనులు తమ ప్రాణాలను తృణప్రాయం అర్పించారని, జైళ్లను, లాఠీలను, తూటాలను, ఉరికంబాలను చిరునవ్వులతో ముద్దాడిన సర్దార్ భగత్ సింగ్ విప్లవ ధ్రువతారని కొనియాడారు. బ్రిటిష్ పాలన పోవడమే కాదు ఒక మనిషిని వేరొక మనిషి దోచుకొనుటకు వీలులేని న్యాయ సమ్మతమైన సాంఘిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థ కావాలని భగత్ సింగ్ అతని అనుచరులు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అంతర్జాతీయ నియమాలను తుంగలో తొక్కి విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవులను ఉరితీసారని, ఉరి కొయ్యలను సైతం ముద్దాడినటువంటి భారత దేశ ముద్దుబిడ్డ సర్దార్ భగత్ సింగ్ అని అన్నారు. కార్మిక వివాదాల బిల్లులకు ఢిల్లీ అసెంబ్లీలో చట్టాలుగా చేస్తున్న సమయంలో భగత్ సింగ్ పొగ బాంబులు వేసి కరపత్రాలు చల్లుతూ ఉపన్యాసాలు చేశారని, ఇంక్విలాబ్ జిందాబాద్ సామ్రాజ్యవాదం నశించాలి అని బిగ్గరగా నినదీస్తూ యువతలో చైతన్య స్ఫూర్తి నింపి, యావత్ భారతదేశ యువతను ఉత్తేజపరిచి దేశ స్వాతంత్రం కోసం జరిగే స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో యువతను భాగస్వామ్యం చేయడంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు.బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అంతర్జాతీయ నియమాలను తుంగలో తొక్కి విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవులను ఉరితీసే ముందు ఉరికొయ్యలను సైతం వారు ముద్దాడారని కొనియాడారు. వారి అమృత్వానికి నేటికీ 92 ఏళ్ళు నిండాయని వారు కోరుకున్న సమాజం నేటికి సిద్ధించలేదని అనేక సామ్రాజ్యవాద దేశాలు నేడు మన దేశాన్ని దోచుకుంటున్నాయని, దోపిడీ, పీడన లేని సమాజం కోసం విద్యార్థి, యువజనులు మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం నేడు ఏర్పడి ఉందని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వరుసగా అధికారం చేపట్టి తొమ్మిది సంవత్సరాలు కావస్తుంది. అయినా కూడా సమస్త రంగాలను సంక్షోభంలోకి నెట్టుతూ, ముఖ్యంగా జాతీయ నూతన విద్యా విధానం 2020 పేరుతో విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తూ, కార్పోరేట్ కరణ చేస్తూ రిజర్వేషన్లకు పాతర వేస్తున్నారని మండిపడ్డారు. పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఏ. మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ తెల్లదొరలు పోయి నల్ల దొరలు వస్తే ఆ స్వాతంత్ర్యం వట్టి బూటకం అని అప్పుడే భగత్సింగ్ అన్నారు అని, భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్క విద్యార్థి,యువత పోరాడాలని పిలుపునిచ్చారు. దేశ్ కి చౌకి దార్ అని చెప్పుకొని తిరిగే నరేంద్ర మోడీ దేశాన్ని అమ్మకానికి పెడుతున్నాడని, ఆనాడు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు ,గాంధీ లాంటి స్వాతంత్ర సమరయోధులు దేశ స్వాతంత్రం కోసం, పౌరుల స్వేచ్ఛ కోసం త్యాగాలు చేస్తే ఇప్పుడు ఉన్నటువంటి ప్రభుత్వాలు వారి త్యాగాలను మరిచి పౌరుల హక్కులకు భంగం కలిగిస్తున్నారని, వ్యవస్థలను సర్వం నాశనం చేయడానికి పూనుకున్నారని, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల విధానాలను ప్రతి ఒక్కరు ఖండిస్తూ ముందుకెళ్లాలని కోరారు. అతిపిన్న వయసులోనే భారతదేశం స్వాతంత్రం కోసం ఆ ఉద్యమంలో పోరాడి ప్రాణ త్యాగం చేసినటువంటి సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తూ వారి ఆశయాలకు తూట్లు పొడిచే వారిపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలను వక్రీకరించడానికి ప్రయత్నిస్తుందని, దీనిని ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తుందని సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న నరేంద్ర మోడీ ఇవ్వకపోగా, ఉన్న ప్రభుత్వ రంగ వ్యవస్థలను ప్రైవేటీకరణ చేస్తూ రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్నారని, ఇప్పటికైనా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు పరచాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం హిందూ రాజ్య స్థాపనకు కంకణం కట్టుకుందని దళితులపై, ఆదివాసులపై, మహిళలపై, ముస్లిం మైనార్టీలపై ,హిందూ మతోన్మాద దాడులు పెరిగిపోయాయని, కులాలు, మతాలు ప్రాంతాల మధ్య విభజనలు సృష్టిస్తూ తినే తిండిపై, కట్టుకునే బట్టపై ఆంక్షలు విధిస్తున్నారని భారత దేశ సమాజపు మౌలిక అంశాలను నేలమట్టం చేసే బుల్డోజర్ సంస్కృతిని నరేంద్ర మోడీ, అమిత్ షాలు అమలుపరుస్తూ, లౌకిక విలువల్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. లౌకిక భారత రక్షణకై విద్యార్థి యువజనులు భగత్ సింగ్ స్ఫూర్తితో నడుం బిగించి పోరాడాలని కోరారు.

# భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల ఆశయాల సాధన కోసం యువత పోరాడాలి....

**పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.డి రఫీ పిలుపు.**


నంద్యాల బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, దోపిడీ, పీడన లేని సమాజం కోసం ఉరికంబం ఎక్కిన షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు 92 వ వర్ధంతి సందర్భంగా పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.విప్లవ యువ కెరటాలు షాహిద్ భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల ఆశయ సాధనకై పోరాడాలని పి.డి.ఎస్ .యు జిల్లా అధ్యక్షులు ఎస్. ఎం.డి.రఫీ పిలుపునిచ్చారు. మార్చి 23 నుంచి 30వ తేదీ వరకు వర్ధంతి సభలను నిర్వహించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) రాష్ట్ర కార్యవర్గ పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు.. ఈ సందర్భంగా స్థానిక పట్టణ కార్యవర్గం ఆధ్వర్యంలో గురువారం నాడు సాయిబాబా నగర్ లో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరంపిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు రఫీ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు మరణించి మార్చి 23కి 92 సంవత్సరాలు అయినా వారి అమరత్వాన్ని, పోరాట స్ఫూర్తిని నేటి యువత , విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యు పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ఉందని, తక్షణమే నిలిపివేయాలని, డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం ఎన్నికల్లో మాత్రమే అందరికి ఉచిత నాణ్యమైనవిద్య , యువతకు ఉపాధి కల్పిస్తామని బూటకపు హామీలు ఇచ్చి నేడు వాటిని విస్మరించారని విద్యార్థులు, యువత అవగాహన చేసుకోవాలని తెలిపారు. సామ్రాజ్యవాద పెట్టుబడిదారి మార్కెట్ల పెత్తనం కోసం సాగుతున్న దురాక్రమణ యుద్ధంగా చూడాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా యువతను నడి రోడ్డున పడవేసి వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి భగత్ సింగ్, రాజ్ గురు,సుఖ్ దేవ్ ల ఆశయ స్ఫూర్తితో యువత ముందుండి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు నంద్యాల పట్టణ కార్యదర్శి నవీన్, ఉపాధ్యక్షులు నాని కళ్యాణ్ నరసింహ హరి పాల్గొన్నారు.

# లక్ష్యాల మేరకు గ్రామాలలో నిర్దేశించుకున్న గడువు లోపు రీ సర్వే పక్రియను మరింత వేగవంతం చేయాలి

**గ్రౌండ్ ట్రూతింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**
**హద్దురాళ్ళు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి**
**సి.సి.ఎల్.ఏ. స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్**

అమరావతి లక్ష్యాల మేరకు గ్రామాలలో నిర్దేశించుకున్న గడువులోగా రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసేలా చూడాలని సి.సి.ఎల్.ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్ లను ఆదేశించారు. గురువారం సి.సి.ఎల్.ఏ కార్యాలయం నుండి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రీ సర్వే కార్యాచరణ, అమలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, జె.సి. డి.కె.బాలాజీ, డి.ఆర్.ఓ. శ్రీనివాస రావు, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.సి.ఎల్.ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ మాట్లాడుతూ.. ....నాణ్యతా ప్రమాణాల తనిఖీ, గ్రౌండ్ ట్రూతింగ్, ఫైనల్ ఆర్ ఓఆర్, డ్రోన్ ఫ్లయింగ్ తదితర ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. హద్దు రాళ్ళు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. డ్రోన్ ఏరియల్ ఫ్లయింగ్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. బౌండరీ కన్ఫర్మేషన్, ఏరియా వ్యాలీడేషన్, సర్వే పూర్తి, ఫైనల్ రెవిన్యూ రికార్డు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్, ఫైనల్ ఆర్ ఓఆర్, 13 నోటిఫికేషన్ తదితర ప్రక్రియలన్నీ కూడా పురోగతి కనిపించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. రీ సర్వే ప్రక్రియలో భాగంగా జిల్లాలో 1050 గ్రామాల్లో గాను 250 గ్రామాలలో డ్రోన్ ల ద్వారా రీ సర్వే ప్రక్రియ పూర్తి కాగా మిగిలిన గ్రామాలలో కూడా పనులను పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియ కూడా గడువులోపు పూర్తయ్యేలా చూడాలని అన్నారు.

# గిది శాంపిల్ మాత్రమే.. బాలయ్య ఫ్యాన్స్ కి జాతర ముందుంది



నందమూరి బాలకృష్ణ.. అనిల్ రావిపూడి కాంబోలో రూపొందుతున్న సినిమా ఫస్ట్ లుక్ ను ఉగాది సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చిన విషయం తెల్సిందే. బాలయ్య ను విభిన్నమైన గెటప్ లో చూపించబోతున్నాను అన్నట్లుగానే అనిల్ రావిపూడి ఫస్ట్ లుక్ తో మెప్పించాడు. ఆకట్టుకునే లుక్ తో బాలయ్య సినిమాపై అంచనాలు పెంచాడు.ఉగాది సందర్భంగా విడులైన ఫస్ట్ లుక్ కి వచ్చిన రెస్పాన్స్ నేపథ్యంలో దర్శకుడు అనిల్ రావిపూడి మరో స్టిల్ ను విడుదల చేసి ఇది కేవలం శాంపిల్ మాత్రమే అంటూ అభిమానులను మరింతగా ఊరించాడు. ఫస్ట్ లుక్ కి వచ్చిన రెస్పాన్స్ నేపథ్యంలో అభిమానులకు మరియు ఇండస్ట్రీ వర్గాల వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ కొత్త స్టిల్ ను రిలీజ్ చేయడం జరిగింది.బాలకృష్ణ ను మరో రఫ్ లుక్ లో చూపించిన దర్శకుడు సినిమా పై మరింత ఆసక్తిని క్రియేట్ చేశాడు అనడంలో సందేహం లేదు. వీరిద్దరి కాంబోలో రూపొందుతున్న సినిమా లో హీరోయిన్ గా కాజల్ అగర్వాల్ నటిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఆ విషయమై ఎలాంటి అధికారిక క్లారిటీ రాలేదు.ఇక బాలయ్య కు కూతురు పాత్రలో శ్రీలీల కనిపించబోతుంది. ఇటీవలే ఈమె షూటింగ్ లో కూడా జాయిన్ అయింది. రెగ్యులర్ షూటింగ్ ఒక వైపు చేస్తూనే మరో వైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను కూడా దర్శకుడు అనిల్ రావిపూడి చేయిస్తున్నట్లుగా తెలుస్తోంది. సినిమాను దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తారనే ప్రచారం జరుగుతోంది.షూటింగ్ ను జులై లేదా ఆగస్టు వరకు పూర్తి చేసే విధంగా దర్శకుడు ప్లాన్ చేసినట్లుగా తెలుస్తోంది. ఒక వైపు రాజకీయాలతో బిజీగా ఉంటున్న కారణంగా బాలయ్య షూటింగ్ కు అప్పుడప్పుడు డుమ్మా కొడుతున్నాడట. అయినా కూడా సినిమా ను ముందు అనుకున్నట్లుగా విడుదల చేస్తామని దర్శకుడు చాలా నమ్మకంగా చెబుతున్నాడు.బాలయ్య గత చిత్రాలు అఖండ మరియు వీర సింహారెడ్డి సినిమాలు మంచి విజయాలను సొంతం చేసుకున్నాయి. కనుక ఈ సినిమా తో బాలయ్య హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయని అభిమానులు చాలా నమ్మకంగా చెబుతున్నారు.

# ఈసారైనా కృష్ణవంశీ బిజీ అవుతారా!

ఎట్టకేలకు క్రియేటివ్ మేకర్ కృష్ణవంశీ 'రంగమార్తాండ' సక్సెస్ అయింది. సినిమాకి పాజిటివ్ రివ్యూలే వచ్చాయి. తొలి షోతోనే హిట్ బొమ్మ అని విమర్శకులు మెచ్చారు. కృష్ణవంశీ ఈజ్ బ్యాక్ అనిపించారు. అంతకు ముందే సినిమాకి అన్ని పాజిటివ్ వైబ్స్ ఉన్నా? ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారా? అన్న టెన్షన్ లోలోపల ఉండేది. ఇప్పుడా టెన్షన్ నుంచి వంశీ పూర్తిగా బయటకు వచ్చేసారు.తన కష్టానికి తగ్గ ఫలితం దక్కిందన్న ఆనందంలో ఉన్నారు. అయితే అంతిమంగా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాలు సాధిస్తుంది! అన్న లెక్క తేలడానికి కొంచెం సమయం పడుతుంది. మరి సినిమా కమర్శియల్ గా వర్కౌట్ అవుతుందా? అన్నది తర్వాత డిసైడ్ అవుతుంది. ప్రస్తుతానికైతే వంశీ రిలాక్స్ అయిపోయారు. ప్రకాష్ రాజ్ తనకి అప్పగించిన బాధ్యతల్ని దిగ్విజయంగా పూర్తిచేసారు.ప్రకాష్ రాజ్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టారు. ఎందుకంటే ఆయన చెప్పాడు కాబట్టే వంశీ ఈ సినిమా చేసారు. మరి ఇప్పుడైనా కృష్ణవంశీని స్టార్ హీరోలు నమ్ముతారా? అన్నది చూడాలి. 'చందమామ' తర్వాత కృష్ణ వంశీకి చెప్పుకోదగ్గ సక్సెస్ ఒక్కటీ లేదు. ఆ సినిమా తర్వాత వరుసగా ఆరు సినిమాలు నిరాశపరిచాయి. 'గోవిందుడు అందరివాడేలే' సినిమా సమయంలో వంశీ పనైపోయిందని విమర్శలొచ్చాయి.ఆ సినిమా ఆశించిన ఫలితాన్నివ్వకపోవడంతో? ఇక అవకాశాలు కష్టమే అనుకున్న సమయంలో తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'నక్షత్రం' తెరకెక్కించి విఫలమయ్యారు. దీంతో ఐదేళ్ల పాటు గ్యాప్ వచ్చింది. ఏ హీరో -నిర్మాత అవకాశం ఇవ్వలేదు. ఈ క్రమంలో మరాఠీ సినిమా 'నట సామ్రాట్' ని 'రంగమార్తాండ' గా రీమేక్ చేసారు. అదీ ప్రకాష్ రాజ్ ప్రోత్సాహంతోనే జరిగింది. మరి తాజా సక్సెస్ కృష్ణవంశీని మళ్లీ బిజీ దర్శకుడిగా మారుస్తుందా? స్టార్ హీరోలు అవకాశాలు కల్పిస్తారా? అన్నది చూడాలి.అయితే 'రంగమార్తాండ' రీమేక్ కథ కావడం వంశీపై కొంత ప్రతికూలత పడే అవకాశం ఉంది. సొంత కథతో హిట్ కొడితే ఆ లెక్క మార్కెట్ లో వేరే లెవల్లో ఉంటుంది. రీమేక్ సినిమాతో హిట్ అంటే? చాలా సమీకరణాలు తెరపైకి వస్తుంటాయి. గతంలో రీమేక్ లు చేసి హిట్లు అందుకున్న కొంత మంది దర్శకులు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నారు. పైగా ఇప్పుడు హీరోలంతా పాన్ ఇండియా కంటెంట్ ని చూజ్ చేసుకుం టున్నారు.అదీ ట్రెండింగ్ కాన్సెప్ట్ ఉండేలా చూసుకుం టున్నారు. వీలైనంత వరకూ పాన్ ఇండియా దర్శకులకే పెద్ద పీట వేస్తున్నారు. రామ్ చరణ్- మహేష్- ఎన్టీఆర్ లాంటి స్టార్లను కృష్ణ వంశీ ఇప్పుడున్న స్థితిలో ఒప్పించడం అంటే చిన్న విషయం కాదు. వాళ్లంతా నవతరం దర్శకులవైపు మొగ్గు చూపుతున్నారు. ఒక్క సినిమా అయినా అది సాలిడ్ హిట్ అయితే! మరో ఆలోచన లేకుండా పిలిచి మరీ ఛాన్స్ ఇస్తున్నారు. మరి అంత సాలిడ్ సక్సెస్ 'రంగమార్తాండ' బాక్సాఫీస్ వద్ద నమోదు చేస్తుందా? అన్నది చూడాలి.



# బ్లేజర్ చాటున రష్మిక ఎద అందాల కవ్వింత

రష్మిక ఎక్కడా తగ్గడం లేదు. నేషనల్ క్రష్ గా మారిన తర్వాత ఈ బ్యూటీ అందాల ఆరబోత ఓ రేంజ్ లో ఉంటోంది. బాలీవుడ్ బ్యూటీస్ కి ఏమాత్రం తగ్గకుండా తన గ్లామర్ ను ప్రదర్శిస్తోంది. వెస్టర్న్ మోడ్రన్ ట్రెడిషనల్ అటైర్ ఎలాంటి డ్రెస్సు వేసినా.. తన నడుము అందాలను ఎద సంపదను ప్రదర్శిస్తూ కుర్రాళ్లకు నిద్ర లేకుండా చేస్తోంది.సౌత్ నుండి నార్త్ వెళ్లిన ఈ బ్యూటీ గ్లామర్ విషయంలో ఫుల్ చేంజెస్ చేసేసింది. తగ్గేదేలే అన్నట్లుగానే అల్ట్రా మోడ్రన్ డ్రెస్సులు ఎద ఎత్తుపల్లాలు కనిపించే ఫోజులతో పిచ్చెక్కిస్తోంది. బాలీవుడ్ బ్యూటీస్ కు తన అందంతో సవాల్ విసురుతోంది. ఒంటిపై ఎలాంటి డ్రెస్ ఉన్నా.. అందాల విందు మాత్రం ఆగేదేలే అన్నట్లుగా మారింది రష్మిక.తాజాగా ఈ అమ్మడు బజార్ ఇండియా కోసం ఫోటో షూట్ లో పాల్గొంది. క్రీమ్ కలర్ బ్లేజర్ ధరించింది. అదే రంగు బాటమ్ ధరించింది. మరో పిక్ లో జీన్స్ ధరించి పైన టాప్ ధరించింది. పైనుండి బ్లేజర్ తో లేయరింగ్ చేసింది. ఈ టాప్ నుండి రష్మిక ఎద అందాలు కుర్రాళ్లను కవ్విస్తున్నాయి. మరో పిక్ లో చైర్ పై వయ్యారంగా కూర్చుని ఫోటోలకు ఫోజులిచ్చింది. ఈ పిక్ లో రష్మిక మత్తుగా చూస్తూ కుర్రాళ్లలో సెగలు పుట్టిస్తోంది. ఈ బజార్ ఇండియా పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. క్రష్మిక అందానికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. రష్మిక అందాల విందుపై రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు.ప్రస్తుతం రష్మిక పుష్ప 2లో నటిస్తూ బిజీగా ఉంది. సందీప్ రెడ్డి వంగా రణబీర్ కపూర్ కాంబోలో వస్తున్న యానిమల్ మూవీలో రష్మిక చేస్తోంది. వీటితో పాటు మరికొన్ని ప్రాజెక్టులను ఓకే చేసింది నేషనల్ క్రష్. బాలీవుడ్ లో నిలదొక్కుకునేందుకు జోరుగా ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే రెండు సినిమాలు చేసినా వాటితో అంతగా పేరేమీ రాలేదు. బాలీవుడ్ బ్యూటీస్ కు ఏమాత్రం తగ్గకుండా సోషల్ మీడియాలో రెచ్చిపోయి ఫోటోలు పెట్టేస్తోంది. అలా బాలీవుడ్ మూవీ మేకర్స్ కంట్లో పడేందుకు ప్రయత్నాలు చేస్తోంది.



# మ్యాచ్ ఓడిపోయినా రోహిత్ శర్మ అరుదైన రికార్డు..



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అరుదైన ఘనత సాధించాడు. ఆసియాలో 10000 కంటే ఎక్కువ పరుగులు చేసిన 8వ భారత బ్యాటర్గా రోహిత్ రికార్డులకెక్కాడు.బుధవారం ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో 30 పరుగులు చేసిన రోహిత్.. ఈ అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు.రోహిత్ ఇప్పటివరకు ఆసియాలో 10026 పరుగులు చేశాడు. ఇక ఈ అరుదైన ఫీట్ సాధించిన జాబితాలో భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ 21741 పరుగులతో తొలి స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాతిలో స్థానంలో శ్రీలంక గ్రేట్ కుమార సంగక్కర(18423) ఉన్నాడు.

ఈ అరుదైన ఘనత సాధించిన బ్యాటర్లు వీరే

1.సచిన్ టెండూల్కర్( 21741 పరుగులు)
2.కుమార సంగక్కర(18423 పరుగులు)
3.విరాట్ కోహ్లీ (14694 పరుగులు)
4.సనత్ జయసూర్య (13757 పరుగులు)
5.రాహుల్ ద్రవిడ్ (13497 పరుగులు)
6.వీరేంద్ర సెహ్వాగ్ (12155 పరుగులు)
7.యూనిస్ ఖాన్ (12073 పరుగులు)
8.ఇంజమామ్-ఉల్-హక్ (12070 పరుగులు)
9.దిల్షాన్ (11567 పరుగులు)
10.ఎంఎస్ ధోని (10840 పరుగులు)
11.సౌరవ్ గంగూలీ (10709 పరుగులు)
12.అరవింద డి సిల్వా (10589 పరుగులు)
13.మహ్మద్ అజారుద్దీన్ (10558 పరుగులు)
14.మహ్మద్ యూసఫ్(10059 పరుగులు)
15. రోహిత్ శర్మ(10026 పరుగులు)

ఇక మూడో వన్డే విషయానికి వస్తే.. ఈ మ్యాచ్లో ఆస్ట్రేలియా చేతిలో 21 పరుగుల తేడాతో టీమిండియా ఓటమిపాలైంది. తద్వారా మూడు వన్డేల సిరీస్ను 1-2 తేడాతో భారత్ కోల్పోయింది.

# క్యాన్సర్ మహమ్మారి నుంచి బయటపడిన టెన్నిస్ దిగ్గజం

మహిళల టెన్నిస్ దిగ్గజం మార్టినా నవ్రతిలోవా క్యాన్సర్ మహమ్మారి నుంచి బయటపడింది. మూడు నెలల క్రితం నవ్రతిలోవా గొంతు, బ్రెస్ట్ క్యాన్సర్కు గురైనట్లు వైద్యులు పేర్కొన్నారు.అప్పటినుంచి క్యాన్సర్తో పోరాడిన ఆమె ఎట్టకేలకు దాని నుంచి విముక్తి పొందినట్లు స్వయంగా ప్రకటించింది."క్యాన్సర్ మహమ్మారి నుంచి ఇంత త్వరగా కోలుకుంటానని అనుకోలేదు. చికిత్స సందర్భంగా 15 పౌండ్ల బరువు తగ్గాను. ఆ సమయంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నా. అన్ని భరించి ఇవాళ మహమ్మారి నుంచి విముక్తి సంపాదించా. ఇక క్యాన్సర్ నుంచి విముక్తి కలగగానే టీవీ చానల్ బాధ్యతల్లో లీనమయ్యా." అంటూ తెలిపింది.ప్రస్తుతం 66 ఏండ్ల నవ్రతిలోవా మియామి ఓపెన్లో టీవీ చానల్ ప్రజెంటర్గా వ్యవహరిస్తుంది. అమెరికాకు చెందిన మార్టినా నవ్రతిలోవా 18 సింగిల్స్ , 31 మహిళల డబుల్స్, 10 మిక్స్డ్ డబుల్స్తో మొత్తంగా 59 గ్రాండ్స్లామ్ టైటిల్స్ నెగ్గి చరిత్ర సృష్టించింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**